# 7 మాటలు-7ముఖ్యాంశములు
# మరియు
# సిలువ ధ్యానములు

-: ప్రచురణకర్త :-

**బి. ఇమ్మానుయేలు**

**కాకినాడ**

"సిలువను గూర్చిన వార్త, నశించుచున్నవారికి వెఱ్ఱితనము గాని రక్షింపబడుచున్న మనకు దేవుని శక్తి" - 1కొరింథీ 1:18

కాకినాడ,
21-3-2011

**వెల: రూ. 20/-లు**

## ముందు మాట

సిలువధ్యాన ప్రియులారా, సిలువనీడలో సేదతీర్చుకొందుముగాక! సువార్తకు మూలాధారము సిలువయేగదా. అట్టి సిలువలోని అనేకమైన ప్రత్యేకాంశములున్నవి. యేసు క్రీస్తు ప్రభువు యొక్క జీవితమంతా సిలువతోనే ముడిపెట్టబడియున్నది. విశ్వాసి అంతరంగశుద్ధి కొరకు, సంఘమునకు ప్రభువు యొక్క రూపలావణ్యములొసగుటకున్నూ సిలువయే ముఖ్య సాధనము. మరణగుమ్మమును మోక్ష గుమ్మముగా మార్చివేయగలశక్తి సిలువలోనే కనబడుచున్నది. సిలువ యజ్ఞవేదికపై దీనుడుగా కనబడుచూ ధీరుడుగా పలికిన సప్తపలుకుల పరిమళాలు భూదిగంతముల వరకు నేటికి కోట్లాది హృదయాలను తాకి నిండు నెమ్మదినిచ్చుటయే గాక క్రీస్తులో సంపూర్ణులు చేస్తున్నాయి. ఏడు మాటల్లోనుండి ఊరిన యూటల బానలు లెక్కకుమించియున్నవి. దీనుడను, ఎన్నికలేని వాడనైన నా గిన్నెకూడా నిండిపొర్లు చున్నది. అలా పొర్లిన సిలువ జాడల యూటలో ఈ చిన్న పుస్తకమునకు కొన్ని మాత్రమే అందించగలుగుచున్నాను. ఈ ప్రేరణ కలిగిన నాటి నుండి కేవలము ఒక్క వారము రోజుల్లోనే హృదయపు పొరల్లో నుంచి పైకి చిమ్మిన సిలువ రస మాధుర్యాన్ని మీ ముందుకు తీసికొచ్చాను. దయతో ధ్యానించి మహిమ మేఘమునకు సంసిద్ధుడవగుటకు యేసు రక్తమున శుద్ధుడవు కమ్ము. ఆమెన్

రక్తధారల కృపలో
**బి. ఇమ్మానుయేలు**
బైబిలుమిషను, కాకినాడ.

# సిలువ ధ్యాన ఫలితము

**"మ**న ప్రాచీన స్వభావము ఆయనతో కూడా సిలువ వేయబడెనని ఎరుగుదుము" రోమా 6:6.

మహిమానంద స్వరూపుడైన క్రీస్తుతో కూడ జీవించుటకు శ్రమ, అవమానము, నింద, బాధ, మరణములను జయించి నిత్యజీవదాయకమైన తేజోమయుని వెలుగులో నిరంతరము ప్రకాశించుటకు ఆయనతో కూడ జీవించుటకే మనము యికను పాపమునకు దాసులము కాకుండుటకు ఈ పాపశరీరమును, దాని యిచ్ఛలను సిలువవేయబడియున్నవను సంగతిని గ్రహించుచున్నావా?

అవును క్రీస్తు మన కొరకు చనిపోయెను. మనమును ఆయనతో కూడ చనిపోయి పునరుత్థానుడైన క్రీస్తుతో కూడా జీవించుటకు, నూతన బ్రతుకు, మాదిరిబ్రతుకు, నూతన జీవితమును గురించి ఆలోచించుదము.

ప్రతి విశ్వాసిలో రెండు విధములగు మనుష్యుడు ఉన్నాడు. వారి స్వాభావికయనుభవము రెండు విధములుగా ఒక దానికొకటి వ్యతిరేకముగా కనబడుచున్నది. ఉదాహరణగా ఆదాము x క్రీస్తు. పాతమనుష్యుడు x క్రొత్త పురుషుడు. బహిరంగము x అంతరంగము, పాతబ్రతుకు x క్రొత్త జన్మ, శరీరము x ఆత్మ, లౌకిక జ్ఞానము x విశ్వాసము. చీకటి x వెలుగు. మరణవృక్షము x జీవవృక్షము. చెడ్డఫలములు x మంచి ఫలములు. పాపము x నీతి. శిక్ష x రక్షణ. మరణము x జీవము. పాతయెరూషలేము x నూతన యెరూషలేము. సాతానురాజ్యము x దేవుని రాజ్యము. స్వాభావిక ప్రకృతి రూపము x ఆత్మ సంబంధ రూపము. ఈ విషయములను ధ్యానించి చూడగా ఏమి కనబడుచున్నది? ఇదిగో పాతవి గతించెను. సమస్తమును నూతనమైనట్లుగాను, క్రొత్త జన్మ, క్రొత్తయనుభవముతో జయశీలుడైన క్రీస్తుతో, క్రీస్తులో విజయపథములో మహిమ ప్రయాణములో సాగిపోవుదము. ఆహా! యిట్టి యనుభవమునకు మూలము సిలువ మహాత్మ్యమేగదా.



# మహిమాన్వితమైన పలుకులు

1. తండ్రీ! వీరిని క్షమించుము.
2. నేడు నాతో కూడా పరదైసులోనుందువు.
3. అమ్మా, ఇదిగో నీ కుమారుడు; ఇదిగో నీ తల్లి.
4. నా దేవా! నా దేవా! నన్నేల చేయివిడిచితివి
5. దప్పిగొనుచున్నాను.
6. సమాప్తమాయెను.
7. తండ్రీ! నా ఆత్మను నీ చేతికి అప్పగించుచున్నాను.

## ఏడు - భావములు

1. విజ్ఞాపన, 2. విమోచన, 3. విధేయత, 4. వియోగము, 5. విపత్తు, 6. విజయము, 7. విశ్రాంతి

సిలువ తలంపులతో నాలుగు సువార్తలయందు మరికొన్ని సిలువలు తలంపునకు వచ్చును. 1. ప్రధాన సిలువ-క్రీస్తు సిలువ. 2. పంద్రెండుమంది శిష్యుల యొక్క సిలువ. 3. విశ్వాసి సిలువ. 4. ప్రభువును మోసిన మరియమ్మ సిలువ. 5. ఇద్దరు దొంగల సిలువ. సిలువ = శ్రమ, భారము, వ్యధ బాధ, అవమానము, నింద మొదలైనవి.

## సిలువ మోత - సిలువవేత - సిలువ కూత - సిలువ పూత

ఎ) సిలువను మోసిన ప్రభువును ధ్యానించండి. నగర నడి వీధుల్లో భారమైన పెద్ద కాడిని భుజమున పెట్టుకొని రక్తపు ముద్దలు నేలపై పడుచుండగా హేళన, దూషణలతో బహు బరువును ఈడ్చుకుంటూ గొల్గతాకొండపైకి యిష్టముతో మోసికొనిపోయెను. దేవుని గొర్రెపిల్లను మనసారా స్మరించండి. మహిమ మాటలు వినుటకు ముందే నిన్ను నీవు సిద్ధ పర్చుకొనుము.

బి) కల్వరికొండపై సిలువవేత. గెత్సెమనే తోటలో కారు చీకటిలో శత్రువులకు ఎదురైన ప్రభువును మీరు వెదకుచున్న యేసును "నేనే" అని పలికిన ఒక్క చిన్న మాటకు నేలకు ఒరిగిపోయిన భటులు, నేనే అన్న మెల్లని స్వరముకు సొమ్మసిల్లిపడిపోయిన శత్రువులు ఇప్పుడు ఏలాగు ఆయన చేతులను చాచి మేకులు కొట్టిరి. ఏలాగు త్రాళ్ళతో సిలువకు కట్టిరి? ఏలాగు కర్ర సిలువకు మేకులతో బంధించి నిలువ బెట్టిరి? ఊహించతరమా? సిలువవేతలో ఆ మహనీయుడు చూపిన త్యాగము, సహనము, సిలువవేయుచున్నవారికి ఆయన యిచ్చిన సహాయము. ఆహాఁ తండ్రి యిష్టములో నిశ్శబ్దంగా ఒదిగిపోయిన ఆ ప్రేమా స్వరూపమునుండి స్రవించు ప్రేమధారలు ధ్యానించి ధన్యుడవై సాగిపొమ్ము.

సి) భూమికిపైన ఆకాశముక్రింద నలుదిక్కుల నడిమిలో దేవునికిని నరులకును మధ్యవర్తిగా సిలువమూర్తి సిలువ మహాయజ్ఞవేదికపై నుండి సప్తస్వరాల కూత సప్తలోకాలు ప్రతిధ్వనించాయి. తండ్రి చిత్తమును నెరవేర్చడానికి తండ్రితో ప్రారంభించి తండ్రితో ముగించిన ఆ సప్తపలుకుల సర్వ సంపూర్ణత ఆది అంతము ఆయనే అయివుండి ధ్వనింపచేసిన ఆ సప్త స్వర సంగమమునుండి ప్రవహించు మహిమ యూటలు రుచిచూచుటకు ఆత్మ దాహము కలిగియున్నావా? ప్రియ పాఠకా, ఎవరికో, ఎక్కడో నిన్ను నీవు చూపించుకోవడానికి కాదు ఈ నా మాటల సారం. నీకు నీవుగా అనుభవించి తరించి పావనుడై తేజరిల్లు.

డి) పాపపంకిల కలుష ఎడారి మనుగడలో సుగంధ పరిమళ పూతకు పునాది సిలువేగదా. సిలువను చూచిన శిలలు కరిగి కరిగి పరిమళ పుష్పములై నేటికి ఆధ్యాత్మిక జిజ్ఞాసులకు సువాసనలీయుటలేదా!



భూదిగంతముల వరకు సిలువ వృక్షమున పూయు విశ్వాసపుష్పాలు వ్యాపించి ఎందరెందరికో సేదదీర్చి ఆనందమయులుగా మార్చుచున్నవి. సిలువధ్యానపరుడా! నీ మాట, నీ బాట, నీ క్రియల వాసన ఏలాగున్నది? గోపరసముతోను, సాంబ్రాణితోను, వర్తకులమ్ము వివిధమైన సుగంధ చూర్ణములతోను, పరిమళించుచు వచ్చు ఇది ఏమి? పరమగీతము 3:6 లో ఇది ఏమి అను ప్రశ్నకు సిలువపరిమళముగాక యింకేమైయున్నది?

## కల్వరి గిరి చేరు మనసా

దేవకుమారుడు మానవ జీవితములోని ఆఖరి మాటలను వినుటకు సభల్లోనుండి, టి.వి. ముందుండి, పుస్తకాల్లోనుండి, సంభాషణల నుండి ఒక్కసారి బయటకురా. ప్రియ సోదరీ! సోదరుడా! ఆ మహాపురుషుని అంతరంగమునుండి నిరంతరము ధ్వనించు పలుకులను నీవే స్వయముగా వినుటకు కల్వరి కొండపైకి నెమ్మదిగా మనోనిధానముతో ఎక్కిరమ్ము. ఏ ఘడియలో నీవు ఆ కపాలకొండపైకి వస్తావో, లోకరక్షకుని క్షమ స్వరమును నీకు నీవుగా నీకొరకే వింటావో ఆనాడే ఆ సమయమే నీ శ్మసానపు బ్రతుకు చచ్చి పరదైసు పరిమళాలను అందుకొని సంఘతల్లి వడిలో బిడ్డవై దాహము తీర్చుకుంటావు. నీ దాహము తీరే తరుణం ఇదే. ఇదే నీకు కలుగు భాగ్యం. "సంతుష్టి సహితమైన భక్తి గొప్ప లాభసాధనమైయున్నది" 1తిమోతి. 6:6. అప్పుడే నీకు శుభదినము GOOD DAY.

## సిలువలో మూడు సిలువలు

**I. పాపపు సిలువ :**

కంటికి కనబడే బహిరంగ సిలువకు ముందే క్రీస్తు ప్రభువు అసలైన సిలువను ఆయనపైవేసికొని, మోసికొని కల్వరిగిరికి చేరాడు. లోక పాపమును మోసికొనిపోవు దేవుని గొర్రెపిల్లయను బిరుదు పొందిన కారణ

జన్మడు. రండి మన వివాదము తీర్చుకొందము. మీ పాపములు రక్తమువలె ఎఱ్ఱనివైనను అవి హిమమువలె తెల్లబడును. యెషయా 1:18. నిత్య నాశనమునకు ఈడ్చుకొనుపోవు భయంకర పాపములను అందరిలోనివి, అన్ని పాపములను తన భుజముపై వేసికొని దేవరాజ్య భారముతో ఈ పాపములన్నిటిని ఈడ్చుకొనివచ్చి తల చితుకగొట్టి, కాళ్ళక్రింద నలిపి గొప్ప శక్తిగల మహిమ రక్తధారలతో హరించియున్నాడు. ఆయన దరికి చేరిన ప్రతివాని పాపములకు ఆయనే విడుదలయిచ్చి పరిశుద్ధపర్చును. యేసురక్తము ప్రతి పాపమునుండి మనలను పవిత్రపరచును.

చరణం : లోక పాపములను ఏకంబుగ నీ–పైకి వేసికొంటివా–
నీకు ఆ కాడి పెద్దదై – అధికభారంబాయె
అది మొదటిసిలువాయెనా ॥మూడు॥

## II. నేరముల సిలువ :

శత్రువులు, ఈర్ష్యాపరులు ఆయన మీద పగబట్టి కుట్రాలోచనలు చేసిరి, కుయుక్తులతో గూడిన ప్రశ్నలు వేసి విసిగించిరి. ఆయన మహిమను, సత్య ప్రవర్తనను కించపర్చుమాటలాడిరి. ఆయన మనుష్యుడైయుండియు దేవుని కుమారుడననియు, తానే దేవుడైనట్లును చెప్పుకొనుచున్నాడనిరి. ప్రభుత్వము మీద ప్రజలను తిరుగుబాటుదారులుగా రెచ్చగొట్టుచున్నాడనిరి. పాపములను క్షమించే దేవుడా? నిజముగా పరిశుద్ధుడా? అయితే పాపులు, సుంకరులతో స్నేహమేమిటియని ఆయన వునికినే తప్పుపట్టజూచిరి. ఈలాగున లేని నేరాలు ఆయనపై మోపగా వాటన్నిటిని సహించి భరించెను.

చరణం : లేని నేరములు నీ–పైన దుష్టులు వేయగాను
క్షమించితివా నీకు – ఈ నేరములు గూడ – యెంతో
భారంబాయె – ఇది రెండవ సిలువాయెనా ॥మూడు॥



## III. కర్ర సిలువ :

మంచి సొగసైన యౌవనరూపముగల అతి సుందరుని మృదువైన భుజముపై చాల పెద్దదైన మ్రానును పెట్టిరి.పలువురు కలిసి బలముగా పట్టుకొని తెచ్చిన ఆ పెద్ద కాడిని ఆయన ఒక్కడే భుజముకాచి అతి కష్టముగా లాగుకొనిపోయెను. దుష్టుల కొరడాల దెబ్బలకు నాగటిచాలులవలె ఆయన వీపు దున్నబడెను. రక్తసిక్తమైన రూపము కురూపమాయెను. మనపై వున్న ప్రేమ చేతనే అంత బరువును మోసికొనిపోయెను. అబ్బ! ప్రేమ యెంత మరణమంత బలమైనదోగదా.

చరణం : కలుషాత్ములు కర్ర – సిలువ నీపై మోప – అలసిపోయి
యుంటివా = అట్లు అలసిపోయిన మోయ – నని
చెప్పకుంటివి – అది మూడవ సిలువాయెనా ॥మూడు॥

# మరియొక మూడు సిలువలు

## 1. ఆత్మ మోసిన సిలువ :

జగత్తుకు పునాది వేయకమునుపే దేవుని ఆలోచనా మహాసభలో దైవ త్రిత్వములో కుమారత్వము బల్యర్పణయై రక్తము చిందించిన క్రీస్తు ప్రభువు. 1పేతురు 1:19,20. తల్లి గర్భములో పడకముందే మన పాపములను ఆయన ఎరుగును. సర్వపాపములను వాటినైజమును – పాపఫలమైన శిక్షలు, వ్యాధులు, బోధలు, మరణము, నరకమును ఆయన ఆత్మయందు భరించి వేదనపడిన స్వరూపము.

## 2. మనసు మోసిన సిలువ :

దైవవ్యక్తిగా ప్రేమ స్వరూపుని యొక్క మనస్సు ఎంత నిర్మలమైనదో, స్వచ్ఛమైన సుకుమారుని మనస్సును ఎంత బాధించారో? తర్కవితర్కములతో, సూటిపోటి మాటలతో స్వకీయులే, మేలుపొందినవారే నిష్కారణముగా

ద్రోహిగా చిత్రీకరించిన వేళ, విచక్షణారహితముగా విసిగించిన తరుణంలో, నిరాధార ఆరోపణలతో సిలువవేయుము అను కేకల ధ్వనులమధ్య మౌనముగా నిశ్శబ్దములో ప్రభువు యొక్క మనస్సు ఎంత నలిగినదో! అందుకే గదా విరిగినలిగిన మనస్సులను ఆయన లక్ష్యపెట్టుచున్నాడు.

**3. శరీరము మోసిన సిలువ :**

ఇదిమాత్రమే కంటికి కనబడుచున్నది. దీనిని చూచే స్త్రీలు రొమ్ము కొట్టుకొనుచు ఏడ్చిరి, ప్రలాపించిరి. అయ్యో! అనిరి. పై రెంటిని గ్రహించక పోవుటే మరింత బాధగావున్నది. కేవలము శరీర దృష్టితో శరీరశ్రమను మాత్రమే చూచిన యెడల కాస్సేపు బాధపడి జాలిపడి అయ్యోపాపం అనుకొనుట తప్ప మరియేమున్నది? ఇంతటి దుర్భరశ్రమకు నాలోనున్న పాపమును బట్టియేగదా అను అంతరంగ పరివర్తన అవసరముగదా. దైవచిత్తానుసారమైన దుఃఖము రక్షణార్థమైన మారుమనస్సు కలుగజేయును కాబట్టి, అమ్మలారా, నాకోసం కాదు. మీకోసం, మీ పిల్లల కోసం ఏడ్వండి అని చెప్పి ముందుకు పోయెను.

# అంతరంగ సిలువ

**యే**సుక్రీస్తు ప్రభువుయొక్క గంభీర్యమైన దివ్య స్వరూపమును దర్శించి మహిమ పలుకులు వినుటకు మరొకసారి అంతరంగ సిలువ తలపులలోనికి వెళ్దాము.

1. ప్రభువు సిలువవేయబడినప్పుడున్న స్త్రీలకు, శిష్యులకు, యోహానుకు సిలువ యొక్క బహిరంగ చరిత్ర తెలియును గాని అంతరంగ చరిత్ర తెలియదు. వీరు విశ్వాసుల జాబితాలోనున్నను అంతరంగ చరిత్ర తెలియదు. అపుడు అవిశ్వాసుల జాబితాలోని వారెవరనగా రాణువవారు, శాస్త్రులు, పరిసయ్యులు. ప్రభువును అపహాస్యము చేసినవారు. వీరికి కూడా ప్రభువు



సిలువ యొక్క బహిరంగ చరిత్ర తెలియును. గాని అంతరంగ చరిత్ర తెలియదు. బహిరంగ చరిత్ర కనబడేది; వినబడేది. అంతరంగ చరిత్ర కనబడదు, వినబడదు.

2. వారు శరీర నేత్రములతో చూచిన బహిరంగ చరిత్ర ఏమనగా – తోటలో ప్రభువును పట్టుకొనుట, కోర్టులకు తీసికొనిపోవుట, భుజము మీద సిలువ ఎత్తుట, వీధులగుండ కల్వరికొండకు నడిపించుకొనిపోవుట, గుద్దుట, ఉమ్మివేయుట, కొరడాతో కొట్టుట, సిలువపై పరుండబెట్టుట, మేకులు కొట్టుట, సిలువ నిలువబెట్టుట మొదలగునదంతయు సిలువ యొక్క బహిరంగ చరిత్ర.

3. (ఇక్కడ ఒక అబ్బాయిని సిలువవలె రెండుచేతులు చాపి నిలువబెట్టవలెను. మరికొందరు పిల్లలను ఒకరిని కుడిప్రక్క, ఒకరిని ఎడమప్రక్క, మరియొకరిని ముందు నిలువబెట్టవలెను ఈ ముగ్గురికి మూడు పేర్లు. పాపము, వ్యాధి, శిక్ష అని చెప్పించవలెను) యెషయా 53:4,5 వచనములలో ఈ పైన తెల్పిన విషయము గలదు. పాపము, వ్యాధి, శిక్ష, ప్రజలందరికి ఉన్నవి. వీటిని ప్రభువు తనపై వేసికొనుటయే సిలువ యొక్క అంతరంగ చరిత్ర. మానవునియొక్క జీవిత చరిత్రలో ఈ మూడును గలవు.

4. మొదటి మానవుడు పాపము చేసినాడు, అతని తరువాత సంతానమైన వారందరిలోను పాపము గలదు. ఈ మూడింటిని తీసివేయుటకు దేవుడు ఒక సూత్రము కల్పించెను. ఇవి మానవుని అంటుకొని లోపలనున్నవి. పాపము మానవునిలో గలదు, వ్యాధి శరీరములో గలదు. శిక్ష శరీరములోపల, వెలుపట గలదు. దొంగతనము చేసిన జైలుశిక్ష వచ్చును. చంపినందుకు ఉరిశిక్ష. ఇవి పైకి కనబడు శిక్షలు. వ్యాధి మందుల ద్వారా కొంతవరకు పోవచ్చును గాని పాపఫలితమైన శిక్ష అనగా మరణము తర్వాత వచ్చు శిక్ష పోదు.

5. పాపము అనగా దేవుని ఆజ్ఞకు వేరుగా నుండుట. చూపులో, తలంపులో, మాటలో, క్రియలో దేవునికి వ్యతిరేకముగా ప్రవర్తించుట. ఇట్టి పాపములు మానవుని అంటుకొని ఉన్నవి. వీటికి ఫలితముగా చివర శరీర మరణము గలదు. ఒకరు పాపము చేసి మారుమనస్సు పొందకుండ ఆ పాపములోనే చనిపోయిన యెడల అతడు నరకమునకు పోవలసియుండును. ఇది పెద్ద మరణము (నరకము) శరీర మరణమునకు మరణమున్నదా? అనగా మనిషి చనిపోయిన తర్వాత మరల 70 దినములకు లేక 100 దినములకు మరల మరణము వచ్చిన యెడల, మరణము బ్రతికి ఉన్నదన్న మాటయే. మనిషి చనిపోవును, మరణము కూడ చనిపోవును. మరణము ఎల్లప్పుడూ బ్రతికి ఉండదు. పాపము చేసిన యెడల నరకము ఉన్నది. ఇది ఆత్మ మరణము. అసలైన మరణము. శరీర మరణము అంత ఘోరమైనది కాదు. అయితే నరక మరణము భయంకరము. ఈ నరక మరణము జీవించి బాధించును. ఈ నరక మరణమునకు చావులేదు. అనగా నరకశిక్ష పొందినవారు జీవించి ఉండి బాధపడుదురు.

6. గనుక యేసుప్రభువు పాపము, వ్యాధి, శిక్ష, ఆత్మ మరణము, నరకమును తీసివేయుటకు సిలువ ఎక్కెను. యూదులు మేమే యేసును సిలువ ఎక్కించినామని అనుకొన్నారు. ఇది బహిరంగచరిత్ర. సిలువ యొక్క అంతరంగ చరిత్ర ఏమనగా పాపము, వ్యాధి, శిక్ష పరిహరించుటకు ప్రభువే సిలువనెక్కెను. యూదులు అనుకొన్నది, చేసినది బహిరంగ కథ. ప్రభువు ఎక్కిన సిలువ అంతరంగ కథ. గెత్సెమనే తోటలో ప్రభువును పట్టుకొనుటకు వచ్చినప్పుడు ప్రభువు తన్ను తానే వారికి బయల్పరచుకున్నపుడు వారు వెనుకకు పడిరి. అట్టివారు ఆయననేమి పట్టుకొనగలరు, సిలువ వేయగలరు. ఆయన పట్టుకొననిచ్చినాడు గనుక వారు పట్టుకొనగలిగిరి. కట్టనిచ్చినాడు గనుక ఆయనను కట్టిరి. సిలువ కర్ర మోయుటకు ఒప్పుకొన్నాడు గనుక



వారు ఆయన భుజములపై మోపగలిగిరి. మేకులు ఆయనే కొట్టనిచ్చినాడు గనుక వారు ఆయన చేతులలో, కాళ్ళలో కొట్టగలిగిరి. చంపనిచ్చినాడు గనుక వారు ఆయనను చంపగలిగిరి. ఇదంతయు చేయనిచ్చుట సిలువ యొక్క అంతరంగ చరిత్ర.

7. ప్రభువు సిలువమీద వేసికొన్న వరుసలు ఏవనగా : (ఎ) అన్ని పాపములు, అన్ని వ్యాధులు, అన్ని శిక్షలు వేసికొనెను. హేడెస్, నరక శిక్షను కూడా ఆయన తన సిలువపై వేసికొనెను. (బి) అనేక పాపములు, అనేక వ్యాధులు, అనేక శిక్షలు వేసికొనెను. అందుచేత ప్రభువు సిలువనెక్కెను. (సి) అందరి పాపములు, అందరి వ్యాధులు, అందరి శిక్షలు వేసికొనెను. ఈ అంతరంగ సిలువ చరిత్ర ప్రజలకు తెలియదు. సిలువ మోత, సిలువ వేత ప్రజలు ఎరుగుదురు. అది బహిరంగ చరిత్ర. (డి) నాలుగవ వరుస : నా పాపములు, నా వ్యాధులు, నా శిక్షలు, ఆయన తనపై వేసికొనెను. ఈ నాలుగవ వరుస లేనిదే పై మూడు వరుసల వలన లాభము లేదు. ఎవరి పాపము, వ్యాధులు, శిక్షలు ప్రభువు మోసెనో వారే చెప్పగలరు. ఇక్కడ "రక్షకా నా వందనాలు" అను కీర్తనలోని

1. పాప భారమెల్ల మోసి – బరువు దించి వేసినావు॥
2. వ్యాధి భారమెల్ల మోసి – వ్యాధి దించి వేసినావు॥
3. శిక్ష భారమెల్ల మోసి – శిక్ష దించి వేసినావు"

అను మూడు చరణములు మనోనిదానముతోను, ప్రభువు మోసినాడను విశ్వాసము కలిగించుకొనుచు పాడవలెను. ఎవరికైన ఏదైన బాధ ఉన్నయెడల కన్నీరు వచ్చును. ఆలాగే పాపములను గురించి పశ్చాత్తాపము కలిగిన కన్నీరు వచ్చును. ఇంకొక రకపు కన్నీరు కృతజ్ఞతా కన్నీరు. ఉదా: అబ్బాయి రంగూను పారిపోయినాడు. ఎన్ని ఉత్తరాలు వ్రాసిన జవాబులేదు. అయితే 10 సంవత్సరములకు వచ్చెను. అప్పుడు సంతోషమును బట్టి కన్నీరు

వచ్చును. అలాగే పై మూడు చరణములు అనుభవముతో పాడిన యెడల కృతజ్ఞతా కన్నీరు వచ్చును.

8. యేసు ప్రభువు సిలువపై ఈ మూడును వేసికొనెను గనుక చేసిన పాపములు చెరువులోనున్నవా, నీ ఇంటిలోనున్నవా, నీ హృదయములో నున్నవా? ప్రభువు యొక్క సిలువపైనున్నవి. అలాగే వ్యాధులు నా శరీరముపై లేవుగాని ప్రభువు సిలువమీదనున్నవి. అలాగే శిక్షలు నా మీద లేవుగాని సిలువమీద నున్నవి. అవి నా మీద లేవు అని చెప్పిన తర్వాత కూడ మరల తలంపులోనికి, జ్ఞప్తిలోనికి మానవుడు తెచ్చుకొనుచున్నాడు. ప్రసంగము విన్నప్పుడు సిలువలో ఈ మూడు ఉన్నవని అనుకొని, అటువెళ్ళిన తర్వాత నా పాపములు మోసినాడా? నా వ్యాధి ఆయనపై వేసికొన్నాడా? నా శిక్ష వేసికొన్నాడా? అని మనస్సులో అవిశ్వాసపడెను. అట్లు మరల జ్ఞాపకము చేసికొని అవిశ్వాసపడిన యెడల శిక్ష ఉన్నది.

9. హెబ్రీ 8:12లో "నేను వారి పాపములను ఇకను ఎన్నడును జ్ఞాపకము చేసికొనను" అని దేవుడే చెప్పుచున్నాడు. ఆయన జ్ఞాపకమునకు తెచ్చుకొననప్పుడు మనుష్యుడెందుకు జ్ఞాపకము చేసికొనవలెను. ఈ వాక్యము బైబిలులో గలదు గాని హృదయములోనుండదు. మరణ సమయములో సైతాను వచ్చి నీ పాపములు ప్రభువు క్షమించలేదన్నప్పుడు, జీవితకాల మంతయు నమ్మి మరణమప్పుడు అవిశ్వాసపడిన యెడల శిక్ష వచ్చును. పాపము, వ్యాధి శిక్షలేవనుకున్న లేవు. ఉన్నవి అనుకొన్న ఉండును.

10. వ్యాధిలో, శిక్షలో కృప ఉన్నది గాని పాపములో కృప లేదు. ఒకరికి జబ్బువచ్చినది, ఆ బాధలో పాపములు ఒప్పుకొని రక్షింపబడెను. జబ్బు పిశాచి పని, పాఠము నేర్పుట ప్రభువు పని గనుక వ్యాధిలో కృప ఉన్నది. భక్తులు మరణము పొందగానే పరలోకము వెళ్ళుదురు. మరణము శిక్షయైనను, పరలోకమునకు ఆ మరణము ద్వారమగుట కృపయే. గనుక



వ్యాధిలోను, శిక్షలోను కృప ఉన్నది. వ్యాధి, శిక్ష అను సైతాను యొక్క కార్యములను ప్రభువు కృపలో వాడుకొనును గనుక "విశ్వసించువాడు కలవరపడడు". వ్యాధి, శిక్ష ఉన్నను కలవరపడడు.

11. ప్రపంచములో ఈ మూడే ఉన్నవా. ఈ మూడింటిని దాటిపోయినవి ఇంకేమైన ఉన్నవా? అట్లున్నయెడల ప్రభువు యొక్క సిలువ కార్యము సంపూర్ణము కాదు. ఈ మూడింటినీ దాటిపోయినవి మరేవియులేవు. ప్రభువు అన్నిటిని పరిహరించెను. నరకము వరకున్న సమస్తమును పరిహరించెను. అయితే మన బలహీనతను బట్టి పాపము, వ్యాధి, శిక్ష పూర్తిగా మనలను విడుచుటలేదు. గాని ఒక దినమందు పూర్తిగా అవి విడువబడును.

12. భక్తుడు పాపములో పడునా? పడును. సౌలు ఆత్మను పొంది మరల దావీదును చంపుటకు వెళ్ళెను. హెబ్రీ 6:4లో వెలిగింపబడి, రుచిచూచి, ఆత్మను పొంది పడిపోవుదురు. అట్టివారు నూతన పరచబడుట అసాధ్యము అని గలదు. అయితే ప్రభువు వచ్చి పెండ్లికుమార్తెను తీసికొని వెళ్ళునప్పుడు ఈ మూడును ఉండవు. ఇప్పుడు భక్తులు పడుట, లేచుట ఉండును. పరమునందు పాపము, వ్యాధి, శిక్ష అనగా ఏమిటి అని అడుగుదురు. మహిమలోనికి వెళ్ళేకొలది ఇవన్ని తెలియవు. అట్టి మహిమ కాలము ఆయన త్వరలో ఇవ్వనైయున్నాడు. ప్రభువు తన సిలువ మీద వేసికొన్న పాపము, వ్యాధి, శిక్ష, పూర్తిగా తీసివేయు దినము సమీపించినది. మనము పూర్తిగా నమ్మిన యెడల అవన్నీ పూర్తిగా పోవును.

13. ఆదాము, అవ్వ, అబ్రాహాము! మీరు ఈ మూడు తీసివేయండి అనినయెడల మేము పాపములో నున్నవారము. తీసివేయలేమని అందురు. ఏ పాపము చేయని యోసేపు నడిగిన నాకు శక్తిలేదని అనును. దేవదూతలకు పాపము, వ్యాధి, శిక్ష తెలియదు గనుక తీసివేయలేరు. సంఘమును మీరు పరిశుద్ధముగా నున్నారా? అని అడిగిన 'లేదు' అని జవాబు చెప్పుదురు. ప్రభువు వచ్చినప్పుడు పాపము, వ్యాధి, శిక్ష, శరీరము తీసివేయును గనుక

ఇక పాపము చేయరు. ఇది రెండవ రాకడలో జరుగును. నీతివస్త్రము ధరించు క్రొత్త శరీరము వచ్చును. దేవుని మూలముగా పుట్టినవాడు పాపము చేయడు, చేయజాలడు అనునది అప్పుడు జరుగును.

14. ప్రభువు సిలువమీద చేసిన రెండు పనులు ఏవనగా :

(1) అవస్థలు తీసివేసెను. (2) పరలోక భాగ్యమిచ్చెను, తీసివేసినది ఎక్కువా? గడించినది ఎక్కువా? ఉదా: డాక్టరు గారు రోగితో మూడు నెలల వరకు వ్యాధిపోదని చెప్పి ఆలాగే బాగుచేసెను. పూర్తిగా రోగము పోయినట్లు రోగికి తెలుసు. డాక్టరునకు తెలుసు. అయితే మూడు వారముల తర్వాత రోగి చనిపోయెను. సత్యము చెప్పలేదు గనుక చనిపోయెను. అట్లే పాపము తీసివేసి పరలోక భాగ్యమివ్వక పోయిన యెడల మరల పాపమే చేయుదురు. అప్పుడు రెండు శిక్షలు మనిషికి వచ్చును. గనుక ప్రభువు చేసిన రెండు భాగ్యములు అనుభవించు దీవెన అందరికిని కలుగును గాక! ఆమెన్.

సీ॥ తలపై కిరీటంబు । తగిలించియదుమగా
కాలువలౌచు ర। క్తంబు గారె
రెండు చేతులలోను । రెండు మేకులు గొట్ట
కాలువ లౌచు ర। క్తంబు గారె
మేగాళ్ళు జతపర్చి । మేకుతో గొట్టంగ
కాలువలౌచు ర। క్తంబుగారె
బల్లెంబుతో బొడ్వ । ప్రక్కలోపలనుండి
కాలువలౌచు ర। క్తంబు గారె
తే॥గీ॥ నోరిగిరె మంచినీళ్ళియ్య। రైరి అకట
తన యమూల్య రక్తముమన। ధాత్రి జనుల
పాపనివృత్తికై చిందె । పావనుండు
దీని ధ్యానింపశక్తులు । తేజరిల్లు



# మొదటి మాట (విజ్ఞాపన)

“తండ్రీ, వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుము” లూకా 23:24.

ఆశ్చర్యకరుడైన దేవకుమారుడు లోక చరిత్రనే రెండు భాగములుగా మార్చి వేసాడు. దైవ ప్రసాదితమైన మానవ జీవితాన్ని కూడా రెండు భాగములుగా చేసిరి. 1. లోకరీతి, పాపనైజముతో మిళితమైనది. 2. మార్పు చెందిన పరిశుద్ధ జీవితము. అనగా శరీర సంబంధమైనది, ఆత్మ సంబంధమైనది.

నీతిమంతుడొక్కడును లేడు. ఏ బేధమును లేక అందరును పాపము చేసి దేవుడు అనుగ్రహించిన సంపూర్ణ ఆనందకరమైన మహిమను పొందలేక పోవుచున్నాడు. పాపము వలన వచ్చు జీతము మరణము. మరణము వెనుక నిత్య నాశనకరమైన నరకము. పాపి యొక్క అంతిమస్థితి నరకము. అట్టి నరకము నుండి తప్పించుటకే నరులను రక్షించు పనిపై లోకమునకు వచ్చి యేసుప్రభువు 30 సం॥ల ప్రాయములో నడుము బిగించి ప్రజల మధ్యకు బహిరంగప్రవేశము చేసిరి.

**బోధకొండ-బాధకొండ-మాదిరికొండ :**

వాక్య స్వరూపుడైన యేసు సువార్త ప్రారంభములో కొండెక్కి కూర్చుని దరిజేరిని జనసమూహములకు వెంబడించిన శిష్యబృందమునకు దివ్యమైన సందేశములను ప్రసంగించిరి. నవ్యప్రపంచంలో ఓ ప్రత్యేక స్థానం కలిగియున్న సువార్త సుబోధను లోకానికందించారు. మత్తయి 5,6,7 అధ్యాయాల్లో చేసిన బోధలో అనేక ముఖ్యాంశాలున్నవి. ఉదా: పరలోక రాజ్య వారసులగుటకు దీనత్వము యొక్క ప్రాధాన్యత, సాత్వీకము యొక్క జయకేతనం, నీతియుక్తమైన ఆకలిదప్పులు, దేవకనికరముకై చూపించ వలసిన కనికరము, దైవదర్శనమునకు మూలం శుద్ధ హృదయమని సమాధాన పర్చుటయందే దేవకుమారులు ప్రత్యక్షబడుట, దేవరాజ్య స్వతంత్రకు శ్రమ,

హింస తప్పవనియు, ఈ దివ్యపలుకులే లోకమునకు రుచినిచ్చు సారమనియు, వీటిని గైకొని అనుసరించిన యెడల మానవ మనుగడ తేజరిల్లుననియు పలు రీతుల బోధించిన పరమ గురువు నిన్ను ద్వేషించువారిని ప్రేమించుమని, బాధించు శత్రువులను క్షమించి దీవించుమని ఉద్ఘాటించిన ప్రభువైన యేసు కల్వరిగిరిపై శ్రమను పొందుచూ అక్షరాలా పాటిస్తున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే బోధనాకొండపై ఏమేమి బోధించారో బాధా కొండపై సమస్తమును అనుసరించి ఆయన ఉపదేశములను మరింత స్థిరపర్చియున్నారు.

స్నేహితులను, బంధువులను, కలిసొచ్చినవారిని క్షమించుటకాదు. ఇందు దురభిమానము దాగియున్నది. తనను అక్రమముగా శ్రమపర్చుచూ చంప ప్రయత్నములో వున్నవారిని ప్రేమించి, ప్రార్థించి, క్షమించుచున్నారు. అట్టివారి రక్షణకై తండ్రిని వేడుకొన్నారు.

**తండ్రీ :**

శ్రమలో – బాధల్లో తండ్రిని పిలుచుట సహజధర్మమైయున్నది. మనకు కష్టము కల్గినప్పుడు తల్లిదండ్రులతో చెప్పుకొంటాము. వారు బిడ్డల పక్షంగా పోరాడి పిల్లలకు ఆదరణ కలుగజేస్తారు. ఇదీ సాధరణమే గాని శ్రమా సమయంలో ఏ ఒక్కరు నశించుటకు యిష్టములేని తండ్రి యొక్క అంతరంగ ఉద్దేశ్యమును నెరవేర్చుచున్న ప్రియ కుమారుడు 'తండ్రి' అని పిలిచాడు. ఇంత గొప్ప ప్రేమా హృదయుని పిలుపు విన్నవారు అందుకు భిన్నమైన ఆలోచనలు చేసారు. వీడు తన తండ్రిని పిలుస్తున్నాడు. ఇప్పుడు ఎవరొస్తారో చూద్దాం. ఏ తండ్రి వచ్చి మనము బిగించిన ఉచ్చు నుండి, ఏక కంఠముతో విధించిన మరణశిక్ష నుండి ఏలాగు విడుదల చేస్తాడో చూద్దామని ఆ కఠిన హృదయులు పరికించి చూస్తున్నారు.

**వీరు ఏమి చేయుచున్నారో వీరు ఎరుగరు :**

రక్షకుని నోట వచ్చిన ప్రేమ మాటలలోని కరుణారసయూటలు గ్రహించుటకు ప్రయత్నము చేయుము. నిజముగా వారేమి చేయుచున్నారో



వారెరుగరా? బంధించడం, చీకటిలో కఠినంగా లాగుకొనిపోవడం. దోషిగా నిలువబెట్టడం, తిట్టడము, కొట్టడము, ముసుగువేసి పిడిగుద్దులు గుద్ది, చోద్యమడగడం, అతిబరువైన కాడిని నిర్దాక్షిణ్యంగా ఆయనపై వేయడం, ఆపై కొరడాలతో కొట్టి తీసుకురావడం, నిలువెల్ల పరుండబెట్టి సిలువకు మేకులు గొట్టడం, హేళన దూషణలతో వారు చేయుచున్న పనులను వారు ఎరుగకుండగనే చేస్తున్నారా? కాదు కాదు వారెరుగుదురు. ఆయన ఎవరో వారికి బాగా తెలుసును. ఇతడు నజరేతువాడు కాడా, ఆ వడ్లవాని కొడుకే కదా. నలుగురు లాటిమనిషే కదా. మాసమక్షంలో బోధకునిగా, యాజకునిగా చేయలేదు కదా? తనంతట తానే బోధకుడని పిలిపించుకొంటూ పైగా దేవుని యొద్ద నుండి వచ్చినట్లు దేవుని సొంతకుమారుడిగా వ్యవహరిస్తున్న వాడుకాడా? అవును. ఆ భ్రష్టదుష్టులకు, దుర్మార్గపు పోకడలతో తండ్రి యింటిని వ్యాపారముగా మార్చివేసిన నిలువటంగీల వేషదారులకు, వారి దౌర్భాగ్యపు మూర్ఖ హృదయాలకు అంతకంటే ఎక్కువ ఏమి గ్రహించగలరు.

మరియంతటి ఘోరకృత్యములను అనుభవించుచున్న మహాప్రభువు "వారెరుగరు" అంటున్నారు. ఇది ఏమి చిత్రము. ఎరిగో, ఎరుగకో మొత్తం మీద ఆయనను శ్రమపెట్టారు. శ్రమను ఖండించకుండా మౌనముగా అనుభవించుచున్నారు. ఎందుకో? ఎందుకో! ఎందుకో ప్రియ సోదరుడా, సోదరి గ్రహించి ఆ ప్రేమ క్షమను అందుకో! అందుకో.

భటులు, శతాధిపతి, యూదామతప్రవిష్టులు, యాజకసన్నిహితులు, రోమీయులు, యూదులు, స్త్రీలు, పురుషులు బహిరంగ సిలువను మాత్రమే చూచుచున్నారు. అదే వారెరుగుదురు. గానీ దేవుని రక్షణ కార్యము, పాపి యొక్క విమోచనాకార్యమును వారు గ్రహింపనేలేదు. అయినను దయానిధియైన మన యేసు క్షమాహృదయముతో తండ్రిని వేడుకొంటున్నారు.

**క్షమించుము :**

క్షమాపణ లేకపోతే రక్షణ లేదు. ప్రేమ దీర్ఘకాలము సహించును.

దయచూపించును. డాంభికముగానుండదు. ఉప్పొంగదు అనగా ఉద్రేకపడదు. స్వప్రయోజనమును కోరదు. కోపపడదు, ప్రేమ అన్నింటిని ఓర్చును. అట్టి దివ్యమైన ప్రేమమూర్తి రక్షించుపనిపైనే వచ్చారు గాని శిక్షించుటకు శపించుటకు రాలేదు. ప్రేమతో క్షమాపణ దయచేయుమని తండ్రికి విజ్ఞాపన చేయుచున్నారు. ధనధాన్యముల వలన, తెలివి జ్ఞానము వలన, పుణ్యదాన ములు వలన, శరీర యోగకార్యములద్వారా, జపతపములతో మోక్షము చేరలేము. వీటి మూలముగా పాపి బ్రతుకునకు పశ్చాత్తాపము రాదు. మార్పుచెందలేదు. క్షమాపణతోనే శుద్ధి.

దైవచిత్తానుసారమైన దుఃఖముతో రక్షణార్థమైన మారుమనస్సును పొంది ఇప్పటికైనా దేవుని క్షమాపణ పొందుటకు శిక్షనుండి రక్షణకు వేగిరపడుము. అట్టి ప్రభువును వెంబడించు నిజ క్రైస్తవులకు మాదిరిజూపిన కొండయిదే. ఆమెన్.

## రెండవ మాట (విమోచన)

"నేడు నీవు నాతోకూడ పరదైసులోనుందువు" లూకా 23:43.

మొదటి మాట ద్వారా శత్రువులు, దూషకులు, హింసకుల పక్షంగా ప్రభువు చేసిన విజ్ఞాపన కనబడుచున్నది. నిరపరాధియైన ప్రభువు సిలువపై వ్రేలాడుచుండిరి. ఇరుప్రక్కల భయంకరమైన బందిపోటుగజదొంగలు. అనగా ఇద్దరు తీవ్రమైన నేరస్థులమధ్య నేరములేని ప్రభువు వ్రేలాడుచున్నారు. ఏదేను తోటలో తప్పుచేసిన ఆదాము, అవ్వలకు తీర్పుచెప్పిన ఆయన, అంత్యతీర్పులో తీర్పు తీర్చు జడ్జిగారైన ప్రభువే కలువరిలో యిప్పుడు దోషిగా కనబడు చున్నారు. ఈ లోక జనాంగములు రెండు భాగములు. ప్రభువునకు, ఆయన రక్షణ సిలువకు రెండు ప్రక్కలనున్నారు. రక్షించబడి పరదైసుకు పోవువారు, రక్షకుని తృణీకరించి నాశనములోనికి వెళ్ళువారు. అంటే ఒక ప్రక్క గొర్రెలు మరొక ప్రక్క మేకలు అన్న మాట. ఇహపరములమధ్య వర్తియైన ప్రభువునకు ఇద్దరు దొంగలు దగ్గరగానేవున్నారు. శ్రమలు అందరినీ బాగుచేయలేవు.



ఎడమ ప్రక్క దొంగ నేరము చేసి శిక్ష పొందుచూ ప్రభువును దూషించి హేళనగా క్రీస్తు విరోదుల మెప్పుపొందుటకు "నీవు క్రీస్తువుగదా? నిన్ను నీవు రక్షించుకొని నన్ను కూడా ఈ శిక్షనుండి తప్పించుమన్నట్లు పలికెను. నీకు శక్తివుంటే నన్ను క్రిందికి దించు అన్నాడే గాని మార్పు చెందలేదు. చాలామంది వారి కష్టాలు, నష్టాలు, పాపాలు శాపాలు, బాధలు వేదనలనుండి మమ్ములను విడుదలచేయి అని మాత్రమే అర్థిస్తున్నారు గాని వారి మనస్సు దీనత్వము చెంది మార్పుపొందలేకపోవుచున్నారు. పాపి మార్పు చెందుటకు శ్రమ కాలము ఓ అవకాశమైయున్నది. అయినను కొందరు మార్పు చెందరు. ఆత్మీయతలేని మనిషిని శ్రమలు ఇంకా ఎక్కువగా పాడుచేయును.

కుడివైపున వున్న దొంగ ప్రభువు శాంతగుణమును అట్టితరుణములో ఆయన జూపిన గొప్ప సహనమును మరియు శత్రువులను, ఘోర కృత్యములు చేసిన దుర్మార్గులను చూస్తూ ఏమాత్రమును ద్వేషించక దూషించక, శపితమాట యైనను పలుకలేదు సరికదా పైగా ఈ మహనీయుడు పరలోకపు తండ్రిని వేడుకొంటూ క్షమించమని ప్రార్థిస్తున్నాడనియు ప్రభువులోని దైవత్వమును కన్నులారా చూచి పులకించిపోయాడు. నేరములు చేసి శిక్షలు పొందుచున్న వారు శిక్షా బాధకు తట్టుకోలేక సైనికులను, బాధించువారిని తిట్టుకొంటూ రోధిస్తూ శపితపలుకులు పలుకుతూ చచ్చిపోతారు. ముందు దొంగ కూడా ఆలాగేచేసాడు. గాని ఈ దొంగ ప్రభువు చూపిన ప్రేమ దీర్ఘశాంతమును గ్రహించి హృదయపరితాపము చెంది ప్రభువా "నీవు నీ రాజ్యములోనికి వచ్చునప్పుడు నన్ను జ్ఞాపకము చేసికొనుము" లూకా 23:42. అనగా నన్ను ఈ సిలువనుండి దించవద్దు. నాకిది తగును, పైకి తీసికొనివెళ్ళు, నేను ఈ సిలువ శిక్షను పొందుట న్యాయమే. తోటి దొంగను గద్ధించునప్పుడే నీవు దేవునికి భయపడవా అనియు ఈయన ఏ నేరము చేయలేదనియు చెప్పెనుగదా! ఆహా! ఎంత ధన్యతను అందుకొన్నాడో ఆ దొంగ. యేసును

నిరపరాధి యనియు, దేవుడే అనియు గ్రహించుటయే మోక్షమును ప్రసాదించుమని ప్రార్థించుటకు కారణమైనది. సిలువపై జరుగుచున్న మహత్తరమైన సంభాషణల వెనుకగల భావములు ఎంత మర్మమైనవో! ఎంత రమ్యమైనవో! ఎంత ధన్యమైనవో! చనిపోవుచున్న మనిషి మరియొక చనిపోవుచున్న మనిషిని నిత్యజీవమునిమ్మని అడుగుట ఎంత విడ్డూరము! ఆస్తిలేని ఒక పేదవానిగా నున్న ప్రభువును తన రాజ్యములో చేర్చుకొమ్మని అడుగుట ఎంత ఆశ్చర్యం. ఒక దొంగ మరణద్వారమందున్న దొంగ చావు లోనికి జారిపోవువేళ వినూత్న మనస్సుతో మోక్షలోకములోనున్న పరదైసునే కోరుకొనుట ఎంత మంచిపని! ఆ కల్వరిలో ప్రతిపాపమునుండి పరమ పవిత్రపరచే ఎర్రని రక్తధారలు చిందించే ప్రభువును, పరదైసుకు చేరుచున్న రాజాధిరాజైన ప్రభువును వెంటాడెను. ఎంత విలువ!

ప్రియ సంఘమా! మన ప్రభువు ఒక ఉపదేశకుడుగాను, అద్భుత స్వస్థతలు చేయువాడుగాను మాత్రముగావుండిన యెడల ఆ దొంగ క్షమాపణ అడుగగలడా? రక్షణ పొంది పరదైసుకు చేరగలడా? ఆయన వట్టి బోధలు చేయడానికే రాలేదు. రక్షించుటకే వచ్చియున్నాడని ప్రార్థించెను. వెంటనే తక్షణమే దొంగ చేసిన ప్రార్థనకు జవాబు దొరికెను. నేడు నీవు నాతోకూడా పరదైసులోనుందువు. ఒక్క ప్రార్థనే. ఒక్కసారే పశ్చాత్తాపముతో పరితపించాడు. ఒక్కమారే రక్షింప వెదకుచున్న ప్రభువును తట్టినాడు. ప్రభువు సిలువకు ప్రతిఫలముగా పరదైసు తలుపు తీసిరి. ఆ దొంగ దొరయై ప్రభువుకు తొలిబిడ్డయై మహాధన్యతనొందియున్నాడు. ప్రభువుకు ఎంత ఊరటకలిగిందో. ఆ రోజు ఎంతమంచిరోజు! The First Good Friday. క్షమాపణ ఎవరు యివ్వగలరు? దేవరాజ్య పరదైసును ఎవరు ఈయగలరు? పాపికి రక్షణ ఎవరీయగలరు? దేవుడును, పరదైసును ఏకమైయున్న ప్రభువే వాగ్దానముచేసి నెరవేర్చెను.



అట్టి ధన్యతను పొందిన ఆ దొంగ చేసిన ఏకైక విధానము గ్రహించి ధ్యానించండి. "నేను నేరము చేసినవాడను, పాపిని. నా ప్రక్కనే నిలిచి రక్తమును కార్చుచూ క్షమించుచున్న ప్రభువు నిరపరాధి, పరిశుద్ధుడు" అని గ్రహించి వెంటాడి పరదైసుకేగెను. సిలువనాథునికి నిత్యమహిమ కలుగునుగాక!

## మూడవ మాట (విధేయత)

"అమ్మా, ఇదిగో నీ కుమారుడు... ఇదిగో నీ తల్లి" యోహాను 19:26,27

సిలువను ఆశ్రయించిన సిలువప్రియులారా! లోకాన్ని రక్షించుటకే దిగివచ్చియున్న ప్రభువు అన్నివిధముల బాధ్యతలను ఎరిగి నెరవేర్చు చున్నాడు. ఈ ఉదయం నుండి సిలువను వ్రేలాడి విమోచనా రక్తమును, క్షమాపణ రక్తమును, పరిశుద్ధపర్చు రక్తమును, మనలను రక్షించు రక్తధారలను కార్చుచున్నారు. రాత్రంతా శ్రమ, ఉదయాన్నే అన్యాయపు తీర్పులు, భారమైన, సిలువ మోత, కౄరమైన కొరడా దెబ్బలు, దూషణలమధ్య ఆయనకేమాత్రమును అనుకూలముగాని తరుణములో తండ్రి చిత్తమును మరొకసారి జ్ఞప్తికి తెచ్చుకొన్నారు. 1తిమోతి 5:4లో తల్లిదండ్రులకు ప్రత్యుపకారము చేయుట నేర్చుకొనుట తండ్రికి అనుకూలమైయున్నదని వ్రాయబడినది. 1తిమోతి 5:8లో స్వకీయులను సంరక్షించుట ఎంత ప్రాముఖ్యమో వ్రాయబడియున్నది. అందుకే ప్రభువు తన అంతరంగమునవున్న తండ్రి ఉద్దేశ్యమును తలంచుకొనుచు సిలువపైనుండి క్రిందికి చూచారు.

1. తల్లియు, శిష్యుడైన యోహానును సిలువకు బహు దగ్గరగా నిలిచి యుండుటచూచారు. ప్రభువును అనేకులు వెంబడించిరి గాని సిలువ వరకు నిలిచియుండలేదు. కడవరకు సహించి ఆయనను వెంబడించినవారికే ఆయన బాధ్యతలు అప్పగించారు. అట్టి వారిని బట్టియే సంతృప్తి, ఆత్మానందం, గొప్ప ఆదరణ కలుగును.

**2. "అమ్మా" యిదిగో నీ కుమారుడు :** సర్వలోకరక్షకుని జన్మ విశేషము

లను ఆదినుండి వినుచు, చూచుచు హృదయంలో భద్రపరచుకొన్న మరియ ఒక్కసారి "అమ్మా" అన్న పిలుపు విని ఎంత దుఃఖమును భరించెనో వర్ణింపలేము. లూకా 2:35లోని ప్రవచనము నెరవేరుచున్నది. తన కండ్ల యెదుటనే కుమారుని ఘోరమరణ ఖడ్గము ఆమె హృదయములో దూసుకు పోతున్నది. హృదయపు కోత భరించలేని తల్లిని ఓదార్పుతో – నిలిచియున్న సోదరుడు యోహానును చూపించి నిజమైన కుమారుడుగా కన్పడుచూ మాదిరి కుమారుడుగా ప్రత్యక్షమయ్యాడు. ప్రభువును వెంబడించిన మనమంతా తల్లిదండ్రుల యెడల అట్టి రీతిగా యుండాలని నేర్పుచున్నాడు.

తల్లికినొక సంరక్షకుని – యిచ్చి ఎల్లరకుమాదిరి – కనపరచినావా–
తల్లికి సృష్టికర్తవై–ప్రేమ తనయుండవై గౌర–వించియున్నావా ॥ఏడు॥

**3. యిదిగో నీ తల్లి :** ఆహాఁ! యోహానును ఎంతగా నమ్మియున్నాడో చూడండి. ప్రభువును వెంబడించినది మొదలు దాసుడుగా, శిష్యునిగా, స్నేహితుడుగా, సోదరుడిగా అన్ని విధముల ప్రభువు హృదయాన్ని హత్తుకొన్నవాడు. అందుకే నమ్మకమైన శిష్యుని చూపి సాక్షాత్తూ ఆయన స్థానంలో తల్లియెదుట ప్రతిష్ఠించి, తల్లిని అప్పగిస్తున్నాడు. రోమా 8:17 గమనించండి. ఆయనతో శ్రమపడితేనే ఆయనతోడి వారసులముకాగలం. అనగా పరలోక వారసులం. క్రీస్తు మహిమలో పాలుపొందగలం. మత్తయి 12:50.లో తండ్రి చిత్తము చొప్పున చేయువాడే నా సహోదరుడు, నా తల్లి.

4. ఎ) తల్లియనగా జన్మనిచ్చినది. ఒక వ్యక్తి పుట్టుటకు సాధనముగా నున్నది. దీనిని ఆత్మానుసారముగా ధ్యానించిన సంఘము కూడా తల్లివంటిది. విలపించుచున్న తల్లి. భారము కలిగి కన్నీటి ప్రార్థనలు చేయు సంఘమునకు సిలువచెంతకు చేరి రక్షణ పొందినవారి ద్వారానే ఆదరణ. ఈలాంటి యోహాను వంటి వారు ఎందరు తయారగుతారో వారిని బట్టి సంఘమనే తల్లికి గొప్ప ఆదరణ.

బి) సిలువ నీడలో నిలిచిన దేవుని బిడ్డలే సంఘ బాధ్యతలు స్వీకరించాలి. యోహాను వెంటనే ఆమెను తన యింట చేర్చుకొన్నాడు. గమనించండి



సంఘమును పోషించి ఆదరించుబాధ్యతను స్వీకరించడానికి ఆలస్యము చేయకూడదు. యోహానువలె త్వరపడి ప్రభువు నిన్ను నమ్మి నీకు అప్పగించిన పనిని నమ్మకముగా చేయుము.

5. ఎవరు తల్లి? ఎవరు కుమారుడు? ఆమె ఎక్కడ? ఆయన ఎక్కడ? అంతకుముందు వారు ఒక ఊరివారా? కాదు. ఒక వృత్తివారా? కాదు. బంధువులా? కాదు. స్నేహితులా? కాదు. ఏ విధముగాను దగ్గర కాదు. అయినప్పటికిని ఏలాగు ఇట్టి బంధము కుదిరినది?

"గలిబిలి గలిగెనొకప్పుడు – షిన్యారుబాబెలు కట్టడమును కట్టు
నప్పుడు = పలుకు భాషయు – నొక్కటైనను – పలువిధములగు
భాషలాయెను – నలుదెసలకును – జనులుపోయిరి
కలువరిపై కలుసుకొనిరి ॥ఎంత॥

ప్రియులారా, నరులందరిని దేవుడు ఒకేరీతిగా చేసియున్నాడు. ఒకేరీతిగా ప్రేమించి, దీవించాడు. సర్వసృష్టియైన పంచభూతములను బేధములేకుండా మనుష్యులందరికీ ఒకే రీతిని అనుగ్రహించాడు. అయితే సాతాను విడదీసి, బేధాభిప్రాయములు పుట్టించి వర్గములుగా, జాతులుగా, వృత్తులు, కులములు, హెచ్చు తగ్గులతో ఒకరికి ఒకరికి దూరంగా మార్చివేసాడు.

అయితే తిరిగి అందరినీ ఒక కుటుంబముగా, పరలోకవారసులుగా, ఒక్క రాజ్యముగా చేయడానికే ప్రభువు సిలువనెక్కిరి. ఆయన నీడకు చేరి ప్రభువు పాదసన్నిధిని నిలిచిన మరియమ్మగారు యోహానుగారు ఎంత ఐక్యమైనారో చూడండి. ఒక్క కుటుంబముగా మారిపోయిరి. ఆలాగే మనమందరము కూడా ఎవరు ఎక్కడివారమైనప్పటికిని సిలువచెంతకు చేరిన యెడల మన కలుషములన్నింటిని కడిగి శుద్ధులుగా చేయబడుదుము. పిమ్మట తల్లిబిడ్డల వలెను, అన్నదమ్ములవలెను, ప్రేమ, ఆదరణ, బాధ్యతలు కలిగి తండ్రి చిత్తము నెరవేర్చుదాము. కుమారుని సంతోషపర్చి సమాధానము నొందుదము.

ప్రభువు మిమ్ములను దీవించునుగాక! ఆమెన్. మరనాత!

# నాల్గవ మాట (వియోగము)

"నా దేవా, నా దేవా, నన్నెందుకు చెయ్యి విడిచితివి" మార్కు 15:34.

ఉదయం 9 గం॥ల నుండి 12 గం॥ల వరకు వెలుగులో ప్రభువు చూపిన ఔదార్యము, గంభీరత్వము, క్షమాపణ, రక్షణకార్యము, ఆదరించు విధానము చూస్తుంటే ఆయనకున్న గొప్ప ధీరత్వము, గుండె నిబ్బరము కనబడుచున్నది. పట్టపగలు మండుటెండలో పై మూడు మాటలు పలికిరి. ఆ మూడు మాటలు తన చుట్టువున్న వారిని పారజూచి బాధించువారికే బాంధవ్యుడైనిలిచినాడు. ఇప్పుడు తనలోనికి తాను పయనిస్తున్నాడు. అప్పుడే చీకటి అలుముకొన్నది. పట్టపగలే గాఢాంధకారము చుట్టుకొన్నది. ఈ చీకటి సృష్టి యొక్క సంతాపమా? సృష్టికర్తయొక్క వేదన, శోధన, యాతన చూడలేక సూర్యుడే మరుగైనాడా? మానవులపై ఆయనకున్న మితిలేని ప్రేమకు పరీక్షా? పాపపు చీకటిలో రక్షకుని విలాపము, పాతాళవైఖరిలో పరమపావనుని రక్షణ కార్యము పూర్తిచేయు మహా గొప్ప పోరాటము. నశించినవానిని వెదకి రక్షించుటకు పనిబూనుకొని మనుష్యకుమారుడుగా వచ్చిన యేసునాధుడు వట్టి మనుష్యుడుగానే సర్వమానవ పాపశిక్షను భరించు దేవ న్యాయతీర్పును జరిగించు సమయమది. శిక్షాసమయం, తండ్రి యిష్టములో ఒంటరిగా నలిగిపోవువేళయది. చీకటి శక్తులు చిందులువేసి గేళి చేసే దుర్భరతరుణం. ఆదాము మొదలు కడపటి మనిషివరకు అన్ని పాపముల ఫలితము, అందరి పాపముల శిక్ష, ధీటుగా భరించి అనుభవించు పైశాచిక హీనయనుభవము. అయినప్పటికిని ఆయన వాటన్నింటిని తనమీద వేసికొని నరులకడ్డముగా నిలిచి నరుల పక్షమున స్వీయరక్తధారలతో శుద్ధి చేయడానికే తండ్రియెదుట ఒప్పుకొనివచ్చాడు. గనుక యిష్టముతోనే మరణలోతులలోనికి దిగిపోవుచున్నాడు.

ఇంతటి భయంకర పోరాటమునకు లేక శిక్షయనుభవించుటకు ఏమాత్రము వెనుకదీయలేదు. తొట్రిల్లలేదు, కలవరపడలేదు, అరవలేదు,



కేకలు వేయలేదు. అన్యాయముగా, నిష్కారణముగా సిలువవేయుము సిలువ వేయుము అనుకేకల మధ్యనే ప్రభువు మౌనముగా వ్యధను భరించాడు. అంతటి మహాశక్తిమంతుడైన ప్రభువు ఒక్కసారిగా శ్రమలోయలోనుండి "నా దేవా, నా దేవా అని పెద్ద కేకవేసాడు. ఏమిటా భయానక కేక? ఎందుకోసం? ఎవరికోసం? ఆయన సువార్త, స్వస్థత ప్రయాణాల్లో గ్రుడ్డివారు, కుష్టువారు, పిశాచిపీడితులు, నానావిధ రోగులు, సృష్టివైపరీత్య ప్రళయాలలో ప్రభువా! అని బోధకుడాయని, దావీదు కుమారుడాయని, దేవుని కుమారుడా అని వారి వారి బాధలనుబట్టి, అవస్థలను బట్టి కేకలు వేసిరి. మరి యిప్పుడు ఆయన ఎందుకు కేకవేసినట్టు? కాసేపు ఆలోచించండి. నిదానముగానే గమనించండి. మొదటిమాటలోను చివరిమాటలోను అనగా ఆదిలోను అంతములోనూ కూడా తండ్రీ యని పిలిచిన ఏకైక కుమారుడు, తండ్రిచేత నా ప్రియ కుమారుడనిపించుకొన్న అద్వితీయ కుమారుడు ఈ అంధకార ఘడియలో 'నాదేవా నా దేవా' యని మొరలిడుచుండుట ఎంత విడ్డూరము? అనాదినుండి తండ్రి యొద్దనే తండ్రిలోనే ఏకమైయున్న అద్వితీయకుమారుడు (యోహాను 1:18) తండ్రియందు నేను నాయందు తండ్రియును వున్నామని (యోహాను 14:10,11) చెప్పిన కుమారుడు తండ్రిచేత విడువబడుట ఆయన ఆత్మను కలవరపరచినది. తండ్రి చిత్తములో ఏకమైపోయి సృష్టి నిర్మాణమునకు తండ్రినోట మాటయైనవాడు ఈ కొద్దికాల ఎడబాటును కూడా సహించలేక తల్లడిల్లినవాడు. కీర్తన 22:1లోని "నా దేవా నా దేవా, నన్నేల నీవు విడనాడితివి" యను ప్రవచన నెరవేర్పు జరుగువేళ. తండ్రి చేతుల్లోనే వుండి తండ్రి చిత్తమును నెరవేర్చుటకంటే తండ్రిచేత విడువబడి తండ్రికి దూరముగా తండ్రి యిష్టమునే జరిగించుచున్నప్పటికిని తండ్రి యెడబాటును తట్టుకోలేని ప్రేమ కుమారుని వ్యధను తలంచుకొని మనలోనికి మనం పయనిద్దాం. నాకోసమే, నా పాపమును బట్టియే నరకములో నేను పొందవలసిన శిక్షను ఒంటరిగా ఆయన పొంది నాకు విడుదల కలుగజేసి

యున్నాడు. అబ్బ! ఎంతగా నన్ను ప్రేమించినాడో గదా. ఆయన ప్రేమను కొనియాడతరమా? కృతజ్ఞతా కన్నీటితో కండ్లుమూసుకొని తనివి తీరా వందనములు చెప్దాము.

## అయిదవ మాట (విపత్తు)

"నేను దప్పిగొనుచున్నాను" యోహాను 19:28.

సిలువ మీద దాహముగొన్నది ఎవరు? ప్రశ్న చిన్నదే గాని చిక్కైన ప్రశ్న. అర్థముగాని గొప్ప ప్రశ్న. ఎందుకంటే జీవజలపు పాత్ర ఎండిపోయెను. జీవనదియైన యేసుకే దాహమా? ఈ యేసు ఎవరు? ఈ ప్రశ్న చాలాసార్లు ప్రజలమధ్య, శిష్యులమధ్య, పెద్దల మధ్య పలుచోట్ల వచ్చిన ప్రశ్నే. ఈయన ఎవరైయుండి దప్పిగొన్నాడో? దేనికోసం దాహమన్నాడో? తెలిసికొందాము.

ప్రకృతియావత్తును సృజించినవాడు, సముద్రాలు, నదులను ప్రవహింప జేయువాడు. మేఘములో నీటిని నింపినవాడు. హాగరు కుమారుడు ఇష్మాయేలు బాలుడు ఏడ్చినప్పుడు అక్కడికక్కడే నీటిని కలుగజేసినవాడు. ఇశ్రాయేలీయులకు అరణ్యంలో బండనుండి సయితము జలప్రవాహమును కలుగజేసినవాడు. తన్ను వెంబడించువారిని నీటి బుగ్గల యొద్దకు నడిపించువాడు. ఇన్నింటికి ఆధారమైనవాడు మరెందుకు దాహమునొందెను.

ఇహపరవర ప్రధాతయైన యేసుక్రీస్తు దేవత్వమును, మానవత్వమును కలిగినవాడు. ఆయన దేవునితో సమానమైయుండియు రిక్తునిగా దాసుని రూపమును ధరించుకొనెను. ఫిలిప్పీ 2:6-7; లూకా 19:10. మనుష్యునిగా పట్టబడి గెత్సెమనెతోటలో శత్రువులచేతికి అప్పగించుకొన్నది మొదలు ఆహారము లేక, నిద్రలేక అలసిపోయిన ప్రభువు అయిదు కోర్టులకు బంధీగా వెంటవెంటనే త్రిప్పబడి అవమానింపబడిన ప్రభువు మానసికంగా అలసిన ఆత్మ తీవ్రతలో సిలువదరికి ఎదురువెళ్ళినాడు. ఆ పగలు పగవారి పన్నాగములు, కొరడా దెబ్బలచే మాంసము రక్తము ముద్దలుగా పడినట్లు బాధింపబడ్డారు. బరువైన కొయ్యసిలువ ఆయనపై పెట్టిరి. భుజమున



కాచుకొని గొల్గతా కొండపైకి వేదనతో సిలువను ఈడ్చుకొని వెళ్ళు మార్గము నునుపైనది కాదు. రాళ్ళు, ఎగుడు దిగుడు దారిని సిలువను అదిమి పట్టుకొని కొండ శిఖరముపైకి వెళ్ళుసరికి పూర్తిగా అలసిపోయిరి. సిలువను నేలను దింపిన పిమ్మట దానిపై ఆయనను పరుండబెట్టి మేకులు కొట్టునప్పుడు పొందిన వ్యథ, సహింపులతోనే జీవనాడులు తడియారసాగెను.

నాల్గవ మాటలో వివరించినట్లు మన కోసం పొందిన నరకాగ్ని ఆయనలోని జీవమును హరించివేసినది. చావుకు దగ్గరగా పయనిస్తున్నాడు. ఏదేను తోటలో దేవుడు హవ్వయను స్త్రీతో నీవు ప్రయాసపడి పిల్లల్ని కంటావు అన్నారు. రాబోయే దైవపిల్లలను కనడానికి ఎంత ప్రయాస అవసరమో నాటి ప్రవచనములో కనబడుచున్నది. ఒక జనమును కనుటకు ఒకనాటి ప్రయాసచాలునా? అన్న యెషయా గారి పలుకులు కూడా జ్ఞప్తికి వచ్చుచున్నవి. నీతి జనాంగమును, దేవరాజ్యపుత్రులను కనుటకు దేవకుమారుడు పడిన ప్రసవవేదన ప్రయాసకు జిహ్వా ఎండిపోవుచున్నది. శరీరమునకు ఎండదెబ్బ మనస్సుకు పగవారి పగల దెబ్బలు, ఆత్మకు తండ్రి చిత్తము నెరవేర్చు దాహము. లేఖనములు నెరవేరునట్లును దాహమని పలికిరి. కీర్తన 22:15. నరకములో పాపి పడవలసిన మహా వేదన ఆయన పొంది, పాపి పొందవలసిన దాహమును ఆయన దప్పిగొనుచున్నారు. దాహము గొన్నవారి దాహమును తీర్చుటకు ఆయనే దాహముగొనవలసి వచ్చినది.

ప్రియులారా, మన నిమిత్తము భరించవలసిన సమస్త భారమును పొంది ప్రయాసపడువారలారా, రండి. మీ రాకకోసమే నా దాహం అని ఆత్మ సంబంధమైన నీతిని స్థాపించుటకొరకు దాహముగొన్నారు. మత్తయి 5:6; యెషయా 55:1,2, ఆత్మల రక్షణ దాహంతో సమరయ స్త్రీ రక్షింపబడువరకు దాహముగొన్న ప్రేమమూర్తి.

సహోదరీ! సహోదరుడా, మనకొరకు రక్షణ కార్యమును సంపూర్ణముగా చేసి ముగించి నీ కొరకు, నా కొరకు మన కొరకే దాహము-దాహము అని

దప్పి తీర్చునున్నారు. మన ప్రాణప్రియుడైన వరుడు ఆయన కొరకు సిద్ధపడు వధువుతో "నా దాహము తీర్చు" అంటున్నారు. వ్యర్థముగాని ప్రయాసతో ప్రసవవేదన ప్రార్థనలు చేసి, అనేక ఆత్మలను దేవుని యొద్దకు నడిపించుచూ, ఈ నాసువార్తను వేగముగా ప్రకటించుటయే నాకు దాహము తీరు మార్గము.

ప్రియుడా, లెమ్ము, రక్షణ పాత్ర మనసునధరించి సమరయస్త్రీని దాహమడిగి దాహమును తీర్చినట్లుగా నీవును అనేకుల దాహము తీర్చి ప్రభువు దాహము తీర్చుము. ఆత్మతోడైయుండునుగాక!

## ఆరవ మాట (విజయము)

"సమాప్తమైనది" యోహాను 19:30.

దేవుని యొక్క ప్రణాళిక ప్రకారము దేవమానవుని శరీర జీవితమునకు సమాప్తము. పదియాజ్ఞల అతిక్రమ పాపములకు విమోచన కార్యము సమాప్తము. మనిషి యొక్క రక్షణ కార్యము సమాప్తము. సాతాను తంత్రములకు దాని బ్రతుకునకు సమాప్తము. రక్షణ ప్రవచనములకు సమాప్తము.

మానవునికి దేవుడు యిచ్చిన ఆనంద స్వరూపమును ఏదేనుతోటలో సాతాను ప్రలోభములకులోనై నిషేధ ఫలములను తిని పోగొట్టుకొన్నారు. తిరిగి ఆ దివ్యమైన దైవరూపమును యిచ్చుటకునూ, దొంగవలె భయముతో చెట్టుచాటున దాగి చివరకు వెలుపలకు త్రోసివేయబడిన మనుష్యులను తిరిగి దరిచేర్చుకొని దైవసాన్నిధ్యములోనికి దొరలవలె చేరుటకును, అవిధేయుడైన ఆదామునకు బదులుగా విధేయుడైన కడపటి నూతన ఆదామైన క్రీస్తు చేయవలసిన కార్యములన్నియు సమాప్తమాయెను. సాతాను నైజములో ఇరుక్కుపోయి చావుకళ తెచ్చుకున్న అవ్వకు బదులుగా విధేయతగల సంఘమును వధువును సిద్ధపర్చుపనికి సమాప్తమాయెను. ఏదేనులో రుచి చూడకుండగనే దూరమైన జీవవృక్షఫలములను తిరిగి సిలువ వృక్షము ద్వారా అందించుటకు ప్రియకుమారుడు చేయవలసిన పనియంతటికి సమాప్తమాయెను.



ఆయన తన శ్రమలు ముగిసెనని సంతోషించుటలేదు గాని తన జన్మము మొదలు మరణము వరకు తండ్రి చిత్తమును, తండ్రి అప్పగించిన పని యావత్తును నమ్మకముగాను, సంపూర్ణముగాను నెరవేర్చినందుకు విజయంతో సమాప్తమాయెనని పలుకుచున్నారు. అప్పగింపబడిన పని యొక్క రిపోర్టు అంతా సమాప్తము చేసెను. జగత్తుకు పునాది వేయబడక ముందే అనాది ఆలోచన సభలో తండ్రియెదుట రక్తమాంసములుగల పాపిని రక్షించుటకు రక్తమాంసములతో పాలివాడనై పాపికి బదులుగా నేను శిక్షను పొంది తిరిగి నీయొద్దకు వస్తానని నిబంధనచేసికొనిన ప్రేమావతారమూర్తి, శరీర రక్తములతో చేయవలసిన సమస్తమును జయకరముగా పూర్తిచేసి సమాప్త మనెను. ఇక రెండవ రక్షకుడు అక్కరలేదు. రక్షణకు రెండవమార్గము అక్కరలేదు. పాపులను రక్షించుటకు మరి మరి అవతారములతో పనిలేదు. దేవుడొక్కడే, ఆత్మ ఒక్కటే, రక్షించు మార్గమొక్కటే. ఆ దివ్య మార్గము చూపిన దైవావతారుడొక్కడే అద్వితీయకుమారుడు తానే సమస్తమునై సమాప్తి చేసియున్నాడు.

లోకమా! నరులారా! మీరు పొందవలసిన సమస్త శిక్షను మరణము, నరకమును నేను మీకొరకే అనుభవించాను. నిన్ను రక్షించు రక్షణ కార్యక్రమమంతా చేసిముగించాను అని సమాప్తమని పలికారు. ఓ మనుష్యుడా! ఓ పాపీ, రోగీ, బీదవాడా! ఓ భక్తుడా! ఓ అన్వేషీ, ఓ సాధకుడా, ఓ జ్ఞానముగలవాడా! నీకు కావలసిన చెప్పవలసిన బోధలన్నీ చెప్పేసాను. నీకోసం చేయవలసిన ప్రార్థనలన్నీ చేసిముగించాను. నీవు నమ్ముటకు స్వస్థత, అద్భుతాలు, ఉపకారకార్యములు చేసిచూపించాను.

నేనే మార్గము, సత్యము, జీవమునైయున్నాను. రమ్ము. నన్ను వెంబడించుము. నావలె నిత్యజీవదాయకమైన తండ్రి రాజ్యములో వారసుడవుకమ్ము అని ఆయన పనుల ద్వారా చేసి చూపించి తండ్రితో సమాప్తమని చెప్పుచున్నారు.

ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్తజనులారా, మీరు పొందవలసిన సమస్త శిక్షామరణములను నేను పొందియున్నాను. మీ రక్షణ కార్యమంతా 'సమాప్తము' అని క్రిందికి చూచి లోకముతోనూ, పైకి చూచి తండ్రితోను పలికియున్నారు. ప్రియ సిలువ ప్రియులారా మనమును తండ్రి మనకప్పగించిన సువార్త, రక్షణ భారమును, సంఘ భారమును నమ్మకముగా జరిగించి విశ్వాస నిరీక్షణలతో ఇహలోక జీవితమును ముగించి తండ్రి యొద్దకు పయనిద్దాము. కృప మీకు తోడైయుండునుగాక!

## ఏడవ మాట (విశ్రాంతి)

"తండ్రీ, నీ చేతికి నా ఆత్మను అప్పగించుకొనుచున్నాను" లూకా 23:46.

యేసుక్రీస్తు ప్రభువు బహిరంగ జీవితము యొక్క ముగింపు నిర్మలంగా, ప్రశాంతముగా సంతృప్తిగా తండ్రిచేతికి తన ఆత్మను అప్పగించుకొను విధానము కేవలము మహిమనేత్రముతోనే చూడగలము. అందుకు విశ్వాస మనోనేత్రములు అవసరము. ప్రతి మనుష్యునికి మరణము అనే భయము వున్నది. మరణాన్ని తప్పించుకొనలేని పరిస్థితిలో దుఃఖముతోను, వేదనతోను మరణ గుమ్మములోనికి దిగులుతో వెళ్తాము. పాపఫలితమే మరణము. మరణములోనుండి పాప శిక్షాస్థలమైన పాతాళబిలము నందలి నరకములోనికి త్రోసివేయబడి నిత్య నాశన నరకము పొందవలసియున్నది. క్రీస్తు యేసు ప్రభువు అందరి మరణములను, మరణ కారణములను ఆయనపై వేసికొని చావును చంపి జీవమైలేచి మనకు మార్గము సరాళము చేసియున్నారు. మరణమును పాయలుగాచేసి సజీవులుగా దాటించగలశక్తిమంతుడాయన. ఉదా: ఇశ్రాయేలీయుల యెదుట ఎర్రసముద్రమును పాయలుగాజేసి ఆరిన నేలను నడిపించి అద్దరికి చేర్చెను. అదే సముద్రము దైవవ్యతిరేకులను నశింపజేసింది. నిర్గమ. 14:16; 15:19. అలాగే మరణము కూడా దేవుని పిల్లలకు నిత్య మహిమకు జేర్చుమార్గమైయున్నది. దైవవ్యతిరేకులు నిత్య



నాశనమునకు పోవు ద్వారము మరణమే. క్రీస్తు ప్రభువు ఈ ఏడవ మాట ద్వారా ఆయన జీవమును ముగించుటలేదు గాని తండ్రిచేతికి అప్పగించి శాశ్వత భద్రత కలుగజేస్తున్నారు.

ఆయన మరణసమయములో బిగ్గరగా కేకవేసినట్లు చూస్తున్నాము. ఆ కేక కలవరపు కేక కాదు. భయముతో కాదు. నిరాశకేక కాదు. అనేకులు వినాలి. లోకము ఆయన అంతిమ తరుణమును గుర్తించాలి. ఈ లోకంలో ఎందరో సుఖానుభావులు, స్వార్ధపరులు, స్వప్రయోజనమే గురిగా పెట్టుకొన్న అనేకమందిని మనం చూస్తున్నాము. అట్టివారి చివరి స్థితి హీనముగాను, బహు దుఃఖాక్రాంతముగాను అయ్యో అన్నట్లు ముగుస్తుంది. అందుకే జనములారా, నన్ను చూడండి. నా పని ముగించుకొని వెళ్ళుచున్నాను. ఆనందముగా, విజయోత్సాహముతో వెళ్ళుచున్నాను చూడండి. గమనించండి. అన్నట్లుగా పెద్ద కేకవేసిరి. ఆ కేకకు చుట్టూ మూగియున్న వారు ఆయనవైపు చూచారు. అవును మరి నీవు నేను జీవాంతమునందు పరమతండ్రి కౌగిటిలోనికి, ఆ మహిమరాజ్య లోగిటిలోనికి ప్రవేశించాలంటే ఇప్పుడాయ నను చూడాల్సిందే. ఆ మహిమ ముగింపును ఆలకించవలసినదే. చావు అంటే భయపడువారలారా, వినండి. చూడండి. నేను చచ్చిపోవుట లేదు తండ్రి యొద్దకు వెళ్తున్నాను అన్నట్లుగా వున్నది ఆ పెద్ద కేక!

ప్రభువు యొక్క ఆరవ మాట భూలోక జీవితమునకు సంబంధించినది. దీనికి సమాప్తము చెప్పి ఏడవమాటలో పరలోక ప్రవేశము చేయుచున్నారు. తన ప్రాణమును ఎవ్వరూ తీయలేరు, జీవమును చంపుట సాధ్యము కాదు. ఆయనే స్వయముగా అప్పగించుకొన్నారు. మానవులకు జీవపునరుత్థానము కలుగజేయుటకు ఆయన చనిపోయెను. ఆయనకెంత ఆనందమో! క్రీస్తు మనకొరకు పుట్టెను. క్రీస్తు మనకొరకు బోధించెను. మనకొరకు నరుడై బోధించెను. మనకొరకు మాదిరిజూపెను. మనకొరకు స్వస్థపర్చెను, ఆకలి తీర్చెను, ఆపదలనణచెను, దయ్యములను పారద్రోలెను. మనకొరకే

మృతులను బ్రతికించెను. మనకొరకె నిందలొంది హింసపొందెను. బాధింపబడి శ్రమపడెను. మనకొరకె క్షమించెను, రక్షించెను, ఆదరించెను, నరకమనుభవించెను, దాహముగొనెను. సమస్తము చేసి సమాప్తమనెను. కలవరపడవద్దు, మీకొరకు స్థలము సిద్ధము చేయుటకు వెళ్తున్నానని చెప్పెను. యోహాను 14:1,2. మనకొరకే మహిమజేరి తిరిగిరానైయున్నాడు. అందుకే క్రైస్తవునికి మరణభయము లేదు. నిరీక్షణ కలిగి మహిమ మేఘమునకు ఆయత్తపడుదుముగాక! ఆమెన్. మరనాత

* * *

## సిలువ విలువ

సిలువ దేవుని శక్తి. సిలువే జీవ ద్వారము. పాపకూపమునుండి పైకి లాగునది సిలువే. నింద బాధలకు డాలువంటిది సిలువే. సిలువే ఆత్మ ఖడ్గము. సిలువే శిరస్త్రాణము. సిలువే ఆదరణ. సిలువే వేకువ చుక్క. సిలువే అభయహస్తం. క్రీస్తురూపమునుదెచ్చునది సిలువే. సిలువే జయించు ఆయుదము. సిలువే రక్షణ పాత్ర. సిలువే జీవవృక్షము. విశ్వాసి నిగ్గుతేల్చేది సిలువే. సిలువే నిరీక్షణ సహవాసి. పాపరోగికి మందు సిలువే. శరీర యిచ్ఛలను చంపునది సిలువే. అహమును దించునది సిలువే. ఆశానిగ్రహశక్తికి మూలం సిలువే. డాంబికమును అణచునది సిలువే. సిలువే ఆత్మకు బలం. శుద్ధికి సిలువే సూత్రం. చెడిన మనస్సాక్షిని బాగుచేయునది సిలువే. అంతరంగ సొగసునిచ్చేది సిలువే. జ్ఞాన వివేకములకు సిలువే పాఠశాల. సిలువే కాపరుల కాపరి. హతసాక్షుల కిరీటం సిలువే. పెండ్లికుమార్తె అలంకారములన్నీ సిలువలోనివే. వధువు మహిమ సిలువే. యెద ఎండినవారికి సిలువే జీవనది. చివరకు సత్యమార్గము సిలువే. సిలువే సిలువే సుమా.



# సిలువ స్తుతులు

**త్రియేక దేవుని స్తుతి :**

నేను నశింపక నిత్యజీవము పొందునట్లు తన అద్వితీయ కుమారుని అనుగ్రహించిన మహిమ సింహాసనాశీనుడైన తండ్రికిని, నన్ను విడుదల చేయుటకు నా పాపభారమును మోసికొనిపోవుటకు దేవుని గొర్రెపిల్లగా దిగివచ్చిన సిలువ సింహాసనాశీనుడైన కుమారునికిని, నన్ను సిలువ తట్టుకు ఆకర్షించుకొని నన్ను శుద్ధిచేసి సిద్ధము చేయుటకు అంతరంగ సింహాసనాశీనుడైనయున్న పరిశుద్ధాత్మకును, ఆదియందును, ఇప్పుడును, ఎల్లప్పుడును, యుగయుగములు ఉండునట్లు మహిమ మహిమ, మహిమ మహామహిమ కలుగునుగాక! ఆమెన్.

1. జన్మములోనే, బాల్యమునందే బోళమును అందుకొన్న ప్రభువా, నా నిమిత్తము శ్రమ, నింద, చావు, సమాధి పొందవలసినదని నీకు ముందే తెలిసియున్నప్పటికిని వెనుకాడక ముందుకు వెళ్ళిన ప్రభువా నీకు నా హృదయార్పణ వందనములు, స్తోత్రములు.
2. ప్రభువా, నిన్ను వెంబడించిన శిష్యులను కొందరిని గెత్సెమనే తోట దగ్గర, మరికొందరిని ప్రార్థనా స్థలమునకు తీసికొని వెళ్ళి వారికి మరికొంత దూరముగా వెళ్ళి నా కొరకే మోకరించి రక్తము స్వేదబిందువులుగా నేలరాల్చినంత వేదన పడిన నా కృపగల నాయనా నీ దుఃఖమునకు, నాకొరకై పడిన మరణవేదనలను బట్టి నీకనేక నమస్కారములు, స్తోత్రములు.
3. లోక వ్యవహారములలో పాప బంధకములలో, వ్యాధి బాధ చిక్కులు శాప, శిక్షలనడుమ బంధీనైన నా నిమిత్తము ఏ కారణములేకుండగనే కేవలము నాపైవున్న కారణము చేతనే బంధీవైన ప్రేమాస్వరూపా నీకు వందనములు, స్తోత్రములు.

4. న్యాయమూర్తివైన తండ్రీ, నిన్ను బంధించిన వారందరూ నీయెదుట ముద్దాయిలుగా నిలువబడవలసియుండగా నీవే నా కోసము నన్ను బట్టియే నన్ను అంత్య తీర్పునుండి కాపాడుటకు నీవు దోషిగా నన్ను తలంచుకొనుచూ నిలువబడిన త్యాగమూర్తివైన ప్రభువా నీకనేక స్తుతులు, స్తోత్రములు.

5. సుకుమార ప్రియుడవైన నా ప్రభువా, నా కొరకు కరుకైన సిలువనెత్తుకొని ఆ బరువైన కాడిలో నా పాపభారమును శిక్ష భారమును తలంచుకొంటూ కల్వరి కొండపై నా యొక్క పాపపు మూటను కాడి రూపములో మోసికొని వెళ్ళిన శ్రమ నాధుడా నీకనంతకాల విజ్ఞాపన, స్తుతులు, స్తోత్రములు.

6. నా యొక్క పాపశరీర శుద్ధి, పాపపంకిలమనసు శుద్ధికి మహిమకు సిద్ధపర్చు ఆత్మశుద్ధికి మహిమ శక్తుల రక్తధారలతో సిలువను తడిపి పాపకాడి బంధకములను విదల్చివేసి నిత్య జీవమార్గమును జూపించిన కరుణగల ప్రభువా నీకు నా జ్ఞానమునకు తోచినన్ని స్తుతి, స్తోత్రార్పణలు చెల్లించుచున్నాను.

7. నిత్య జీవదాయకా, మరణము నిన్ను ఏలాగు తాకగలదు? చావే లేని నీకు సమాధితో పనియేమున్నది? ప్రభువైన వరుడా, నన్ను నీ చెంతను కూర్చుండబెట్టు నిమిత్తము నాకు చావు, సమాధిలేకుండా సజీవ ఆరోహణ అంతస్థునిచ్చుటకు మరణమును నీపైకి లాగుకొని సమాధికి వెళ్ళి జయించి లేచిన పునరుత్థాన ప్రభువా నీకు నా జీవితకాల మంతయు స్తుతించిన తనివి తీరదు. ప్రభువా, నా దేవా, నా ప్రియుడా, నా ప్రాణనాథుడా, నీకనేక హృదయార్పణ స్తుతులు, స్తోత్రములు, స్తోత్రములు, స్తోత్రవందనములు

**– మరనాత –**



# సిలువ నిధి

| | | | |
|---|---|---|---|
| సిలువే నా మది | –సిలువే నా నిధి | సిలువే నా గమనం | – సిలువే నా సహనం |
| సిలువే నా శరణం | –సిలువే నా చరణం | సిలువే నా బెత్తము | – సిలువే నా బత్తెము |
| సిలువే నా ఆశ్రమం | –సిలువే నా ఆశయం | సిలువే నా ధ్యానము | – సిలువే నా జ్ఞానము |
| సిలువే నా దీక్ష | –సిలువే నా మోక్షం | సిలువే నా జయం | – సిలువే నాయనుభవం |
| సిలువే నా విలువ | –సిలువే నా చలువ | సిలువే నా పదం | – సిలువే నా రథం |
| సిలువే నా కాపరి | –సిలువే నా ఊపిరి | సిలువే నా సూత్రం | – సిలువే నా గాత్రం |
| సిలువే నా సహకారి | –సిలువే నా ఉపకారి | సిలువే నా గానం | – సిలువే నా పానం |
| సిలువే నా నాయక | –సిలువే నా పోషక | సిలువే నా సిరి | – సిలువే నా పురి |
| సిలువే నా దీపము | –సిలువే నా రూపము | సిలువే నా గురి | – సిలువే నా దరి |
| సిలువే నా త్యాగము | –సిలువే నా భాగ్యము | సిలువే నా బలం | – సిలువే నా ఫలం |
| సిలువే నా భోజ్యము | –సిలువే నా పూజ్యము | సిలువే నా రాగం | – సిలువే నా యాగం |
| సిలువే నా పారము | –సిలువే నా పీఠము | సిలువే నా శక్తి | – సిలువే నా ముక్తి |
| సిలువే నా ప్రాణము | –సిలువే నా బాణము | సిలువే నా భక్తి | – సిలువే నా సూక్తి |
| సిలువే నా ఆసనం | –సిలువే నా శాసనం | సిలువే నా ధ్వజం | – సిలువే నా భుజం |
| సిలువే నా మలుపు | –సిలువే నా గెలుపు | సిలువే నా నీడ | – సిలువే నా తోడు |
| సిలువే నా చిగురు | –సిలువే నా పరుగు | సిలువే నా కన్ను | – సిలువే నా మున్ను |
| సిలువే నా రక్షణ | –సిలువే నా శిక్షణ | సిలువే నా మందు | – సిలువే నా విందు |
| సిలువే నా ధైర్యం | –సిలువే నా స్థైర్యం | సిలువే నా ఊత | – సిలువే నా పూత |
| సిలువే నా మరుగు | –సిలువే నా మెరుగు | సిలువే నా మేత | – సిలువే నా కూత |
| సిలువే నా కొలమానం | –సిలువే నా బహుమానం | సిలువే నా వ్రాత | – సిలువే నా మోత |
| సిలువే నా చెలిమి | – సిలువే నా కలిమి | సిలువే నా మాట | – సిలువే నా బాట |
| సిలువే నా సన్నిధి | – సిలువే నా పెన్నిధి | సిలువే నా మూట | – సిలువే నా కోట |
| సిలువే నా ప్రేరణ | – సిలువే నా ఆదరణ | సిలువే నా దన్ను | – సిలువే నా వెన్ను |
| సిలువే నా పోరాటం | – సిలువే నా కిరీటం | సిలువే నా శుద్ధి | – సిలువే నా వృద్ధి |

| | | | |
|---|---|---|---|
| సిలువే నా గాథ | - సిలువే నా బోధ | సిలువే నా పట్టు | - సిలువే నా మెట్టు |
| సిలువే నా ధర్మం | - సిలువే నా మర్మం | సిలువే నా శృతి | - సిలువే నా స్తుతి |
| సిలువే నా ఇల్లు | - సిలువే నా ముల్లు | సిలువే నా యూట | - సిలువే నా పాట |
| సిలువే నా ఓపిక | - సిలువే నా దీపిక | సిలువే నా స్థితి | - సిలువే నా గతి |
| సిలువే నా ముద్దు | - సిలువే నా హద్దు | సిలువే నా గ్రంథం | - సిలువే నా బంధం |
| సిలువే నా సత్యం | - సిలువే నా ముత్యం | సిలువే నా జీవం | - సిలువే నా సర్వం |
| సిలువే నా తోట | - సిలువే నా పాటు | సిలువే నా గొడుగు | - సిలువే నా వెలుగు |
| సిలువే నా కాటా | - సిలువే నా పీట | సిలువే నా అండ | - సిలువే నా దండ |
| సిలువే నా ధనము | - సిలువే నా ఘనము | సిలువే నా తలపు | - సిలువే నా వలపు |
| సిలువే నా జ్యోతి | - సిలువే నా ఖ్యాతి | సిలువే నా జపము | - సిలువే నా తపము |
| సిలువే నా గమ్యం | - సిలువే నా కృత్యం | సిలువే నా గురువు | - సిలువే నా పరువు |
| సిలువే నా అరుపు | - సిలువే నా మురుపు | సిలువే నా పాదిరి | - నా మాదిరి |
| సిలువే నా నీతి | - సిలువే నా ప్రీతి | సిలువే నా సాక్ష్యం | - నా మహాత్మ్యం |
| సిలువే నా నాథం | - సిలువే నా వేదం | సిలువే నా జాడ | - సిలువే నా త్రాణ |
| సిలువే నా యాత్ర | - సిలువే నా పాత్ర | సిలువే నా గృహం | - సిలువే నా కలము |
| సిలువే నా ఓర్పు | - సిలువే నా నేర్పు | సిలువే నా పావన | - సిలువే నా దీవెన |

**"ఏమికావలె - నా - కేమికావలె = యేసు సిలువ దీక్ష తప్ప - నాకేమికావలె"**

* * *

# సిలువ హెచ్చరికలు

ప్రభువునందు ప్రియులైన క్రైస్తవ సోదరులారా, నాతోటి సేవక బృందమా, సిలువచాటున బోవు చిరుసేవకులను ధనఘనతలతో అధికారముసుగులో దురహంకార స్వాభిప్రాయ నిర్ణయాలతో క్రైస్తవ్యానికే మచ్చదెచ్చు కార్యకలాపములతో మత్తిల్లిన మతపీఠాధిపతులకు సిలువ హెచ్చరికలు వినబడుచున్నవి, కనబడుచున్నవి. ఈ హెచ్చరిక బోర్డులను గమనించి వెళ్ళకపోతే కలుగు దుర్గతి వర్ణింపతరమా!?



**మొదటి బోర్డు :**

ఇస్కరియోతు యూదా - పోయి ఉరి పెట్టుకొనెను. మత్తయి 27:5. నాటి కాలములో ప్రభువు చేత పిలువబడి ఆయనను వెంబడించిన వారికి ప్రజలు యిచ్చిన బిరుదు "యేసుతోనున్న వారు" ఆహా ఎంత మంచి పేరు! ఈ పేరు ఆ నోట ఈ నోట ప్రజలందరి దరికి పోయినది. శాస్త్రులు, పరిసయ్యులు, వివిధ పీఠాధిపతులకును చేరినది. నిజమే యేసుతోనుండుట ఎంత భాగ్యము! ఆయన కృపలేనిదే అంతటివారము కాగలమా? అందునా ప్రభువును వెంబడించినవారందరిలోను అధిక ప్రేమను పొందినవాడు, ఖజానాధికారి (సొమ్ము మీద పెత్తనం) ఉద్యోగమును పొందిన యూదా గారు ప్రభువుతో వున్నవాడు. గొప్ప బాధ్యతగల పని కలిగినవాడు. పండ్రెండు గంపలలో ఒకటి పంచినవాడు. ప్రభువుచే ప్రతిష్ఠించబడి బోధకు, అద్భుత స్వస్థతలు చేయడానికి పంపబడినవాడు. దేవబోధకుని బోధలన్నీ విన్న వేదాంత విద్యార్థి. ప్రభువునకు దగ్గరగావుండి స్వస్థతలు, దెయ్యములను వెళ్ళగొట్టుట, చచ్చినవారిని బ్రతికించుట, తుఫానును గద్దించుట, నీటిపై నడచివచ్చుట కన్నులారా చూచినవాడు. ప్రభువు గద్దించగా పచ్చటి అంజూరపు వృక్షము ఉన్నపాటున ఎండిపోవుట, దెయ్యములు గజగజవణకి పారిపోవుట ఇత్యాది ఎన్నెన్నో చూచినవాడు. అయినను మారలేదు. ఎంత విచారము. ఎంతటి దౌర్భాగ్యపుగతి.

యూదా అనగా స్తుతి, కీర్తి యను అర్థముగల గోత్రము. క్రీస్తు ప్రభువు గోత్రమునకు చెందినవాడు. ఎవరైనా నీది ఏ గోత్రము ఎవరి తాలూకు అని అడిగిన ఏమని చెప్పును? యాకోబువంశీయుడైన ఆ యూదా వంశకర్త. ఈ యూదా గోత్రమునకే మచ్చతెచ్చిన నమ్మక ద్రోహి. యేసును కోరినవాడు చేరినవాడు, చూచినవాడు అయినను మారలేదు. ఎంతటి అవమానకరమైన దుఃఖము! జాగ్రత్త. ఈ బోర్డు సూచనలు మనసునబెట్టి సాగుము సోదరా!

**రెండవ బోర్డు :**

ఈ బోర్డుపై సన్హెద్రిన్ సభ చిత్రీకరణమున్నది. ఇది యూదుల అధికార సంఘము. వీరు డబ్బదిమంది సభ్యులుంటారు. వీరికి 'యూదుల ఆలోచన సభ' అని పేరు. స్వజనులలో ఎవరైన అక్రమమునకు గురియైన, అన్యాయముగ ఆపదలో చిక్కుకొనిన, ధర్మశాస్త్రములను మీరినయెడలను, దైవసిద్ధాంతములకు వ్యతిరేకముగానున్నను ఈ సభ యొద్దకు విచారణకు వచ్చును. అప్పుడు యూదా ఆలోచన కమిటీ ధర్మశాస్త్రానుసారముగ న్యాయమును చెప్పి సంక్షేమసమాధానములను కాపాడుదురు. గాని స్వకీయుడైన యేసుప్రభువును ఎరిగియున్నను, ఉపకారములను చూచిననూ, అద్భుతాలు చూచిననూ దివ్య బోధలు వినియున్ననూ వారు మారలేదు. నిర్దోషిని, నిరపరాధియైన ప్రభువును అన్యాయముగా సిలువకప్పగించిరి, యూదా జనాంగమునకే కీడుతెచ్చిరి. రక్తాపరాధము వారిపై మోపబడినది.

జాగ్రత్త ప్రియుడా, సత్యపరిశీలన చేయకుండా దుష్టుల మెప్పును పొంది ఎవరికిని తీర్పు చెప్పకుండునట్లు నీ నోటిని కాచుకొనుము.

**మూడవ బోర్డు :**

దారి తప్పిన మనిషి రక్షణ కార్యము జరిగించుటకు, దీనజన బాంధవ్యుడు, పరమదేవ పుత్రునికి దగ్గరగా నిలువబెట్టబడిన మారని దొంగ దుర్భరస్థితి. చేతికందిన రక్షణను కాలితో తన్నినట్లున్నది. తోటి దొంగ గద్ధించినా, బుద్ధిచెప్పినా చెవినిబెట్టలేదు. లోకరక్షకుని క్షమాపణ అతిదగ్గరగా విన్నను హృదయకాఠిన్యముచేత దైవరూపమును చూడలేకపోయెను. పరదైసు ప్రక్కనుండే క్రిందికి జారిపోయెను. నీవెటు పోవుచున్నావు?

**నాల్గవ బోర్డు :**

సమాధికి కావలియున్న రోమా సైనికులు. లోకములో ఎక్కడా జరుగని



వింతైన డ్యూటీయిది. జీవమును బంధించి చంపి సమాధి చేసాము. భటులారా, ఈ జీవము సాధారణమైనది కాదు. సృష్టికి జీవము పోసిన జీవధాత. నేనే జీవమును, నన్ను చంపుతారు. నేను లేస్తాను అని చెప్పి మరీ చచ్చిన జీవమిది. అందుకే సమాధిని పెద్ద రాతితో బంధించాము. ముద్రవేసాము. మీరు జాగ్రత్తగా మెళుకువగా వుండాలని హెచ్చరిక పొందినవారు. సర్వశక్తి ప్రభావములతో వారికళ్ళయెదుటే మహిమ ప్రకాశముతో పునరుత్థానుడైన యేసును వారు చూడలేకపోయిరి. వెలుగుకు మూర్చిల్లినవారు ఎంత భయపడవలసినది? ఏ మనుష్యుడు దరికి రాకుండగనే రాయి దొర్లింపబడుట ఆ దివ్యమైన అద్భుత సాక్ష్యమును వారే ప్రకటించి సాక్షులుగా వుండాల్సింది పోయి అబద్ధములను చాటుట, గొప్ప అద్భుత సాక్ష్యమును ధనాపేక్షతో, అధికారుల దుష్టపన్నాగములకు అండగానిలిచిరి. ఎంత చెడిపోయిరో! కనీస మనస్సాక్షి కూడా లేని భ్రష్టులైరి. వారి ఉద్యోగములను మాత్రం కాపాడుకొనిరి. ప్రియుడా గమనించావా? ఈ బోర్డులో నీవున్నావేమో! వుంటే సత్యసాక్షివి కాజాలవు.

## ప్రార్థన

సిలువ మహిమ వెలుగును మాయెదుట ప్రకాశింపజేసిన కల్వరి నాధుడా నీకు వందనములు. ఈ హెచ్చరికలను గ్రహించుకొని నిన్నుమాత్రము ఆశ్రయించు ధన్యత, సిలువ విలువనెరిగి నిన్ను వెంబడించు భాగ్యము దయచేయుమని వేడుకొనుచున్నాను తండ్రీ. ఆమెన్.

* * *

## మరనాత